



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 212 తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 24 ఏప్రియల్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-










# ఉత్తరాంధ్రలో పెట్టుబడుల పండుగే

- అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా మారుస్తాం
- 160 గిగా వాట్ల రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంలో 50 శాతానికి పైగా సాధించాం
- విద్యుత్ భారాన్ని భరిస్తున్నాం... విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తున్నాం
- నాడు ప్రొక్లెయిన్లతో కూల్చివేతలు... నేడు అభివృద్ధి పనులు
- అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నాం
- కిల్లర్ పార్టీని దూరంగా పెట్టండి
- రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్‌కు చెందిన రెండు ప్లాంట్లకు సీఎం చంద్రబాబు భూమిపూజ

**అనకాపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలపై విద్యుత్ భారాన్ని వేయకుండా... ఆ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందని... అలాగే విద్యుత్ ఛార్జీలను తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. జాతి నిర్మాణంలో భాగంగా రెన్యూవబుల్ ఎనర్జీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని సీఎం చెప్పారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జెడ్ చింతువలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థకు చెందిన రెండు ప్లాంట్ల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నాయుడు గరువారం భూమిపూజ నిర్వహించారు. రూ. 5,400 కోట్లతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాంబిల్లి పెట్టుబడులు పెట్టనుంది. సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టు పనులకు సీఎం చంద్రబాబు భూమి పూజ చేశారు. రూ. 4,200 కోట్లతో 6.5 గిగావాట్ల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, రూ. 1200 కోట్లతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టును రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈ రెండు ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా మిగతా .. 2లో..

# 'భారత్ గొప్ప దేశం'..

## ట్రంప్ నష్ట నివారణ చర్యలు



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్‌ను నరక కూపంతో పోల్చి వివాదంలో చిక్కుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నష్ట నివారణ చర్యలకు దిగారు. సామాజిక మాధ్యమంలో వచ్చిన పోస్టును రీపోస్ట్ చేయడం ద్వారా వివాదంలో చిక్కుకున్న ఆయన.. 'భారత్ ఎంతో గొప్ప దేశం. నా మిత్రుడు అక్కడ ఉన్నత స్థానంలో ఉన్నారు' అని పేర్కొనడం గమనార్హం. ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయ అధికార ప్రతినిధి ఓ ప్రకటనలో వెల్లడించారు. అయితే, భారత్ గొప్ప దేశమంటూ ట్రంప్ ఎప్పుడు, ఎక్కడ అన్నదీ మాత్రం పేర్కొనలేదు. అమెరికాలో అమల్లో ఉన్న జన్మతః పౌరసత్వ చట్టాన్ని ట్రంప్ ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ షేర్ చేసిన లేఖను ట్రంప్ రీపోస్టు చేశారు. తన పోస్టులో భారత్, చైనాను నరక కూపాలు అంటూ ప్రస్తావించడం, దానికి మద్దతుగా మిగతా .. 2లో..

భాజపా సర్కార్ వస్తే..

# బెంగాల్‌లోకి ఎవరూ చొరబడలేరు

## కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**బాలాగఢ్, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ బెంగాల్‌లో ఈసారి అధికారం భాజపాదేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. తొలి విడత పోలింగ్ ముగుస్తున్న తరుణంలో బెంగాల్‌లో తాము పూర్తి మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు మిగతా .. 2లో..

ట్రంప్ 'నరకం' వ్యాఖ్యలు..

# స్పందించిన భారత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌ను నరకంతో పోల్చడంపై.. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ స్పందించారు. "ఆ కథనాలను మేం చూశాం. వాటిని అక్కడితో వదిలేస్తున్నాం" అని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. అమెరికాలో అమల్లో ఉన్న జన్మతః పౌరసత్వ చట్టాన్ని ట్రంప్ ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ షేర్ చేసిన లేఖను రీపోస్టు చేశారు. "ఆసియా దేశాల నుంచి మహిళలు తొమ్మిదో నెలలో అమెరికాకు వచ్చి బిడ్డకు జన్మనిస్తారు. ఇక్కడ ఉన్న మిగతా .. 2లో..

# అగ్ర వర్ణాల్లో పేదరికాన్ని రూపుమాపుతాం

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థికంగా వెనుకబడి ఉన్న అగ్ర కులాల పేదలకు(ఈడబ్ల్యూఎస్ వర్గీయులు) కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందని, వారి పేదరికాన్ని పారదోలేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తులు తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా ఈడబ్ల్యూఎస్ యువతకు ఎంఎస్ఎంఈ పార్కుల్లో ప్రాధాన్యమిస్తున్నామన్నారు. తాడేపల్లిలో కమ్మ కార్పొరేషన్ కార్యాలయాన్ని మంత్రి సవిత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండేలా ఒకే సముదాయంలో కమ్మ కార్పొరేషన్, పాలక మండలి సభ్యుల కార్యాలయాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక ఆదాయం మిగతా .. 2లో..

మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు పార్థివదేహానికి

# నివాళులర్పించిన మంత్రి కందుల దుర్గేష్



**హైదరాబాద్/ అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నాదెండ్ల భాస్కరరావు అంత్యక్రియల సందర్భంగా రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ఆయనకు ఘన నివాళులర్పించారు. గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ నివాసానికి చేరుకున్న మంత్రి దుర్గేష్ మాజీ సీఎం భాస్కరరావు పార్థివదేహంపై పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం తండ్రిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులను మిగతా .. 2లో..

నాదెండ్ల మనోహర్‌ని ఫోన్‌లో

# పరామర్శించిన పవన్ కళ్యాణ్

**విశ్వం వాయిస్ న్యూస్ :** శస్త్రచికిత్స జరిగి బయటకు రాలేని పరిస్థితిలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు అంత్యక్రియల్లో పాల్గొనలేకపోతున్నానని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ బాధను వ్యక్తం చేశారు. భాస్కరరావు కుమారుడు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కి మిగతా .. 2లో..

శ్రీవారి భక్తుల కోసం తిరుమలలో

# 16 వైద్య కేంద్రాలు



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల ఆరోగ్య భద్రతపై తితిదే ప్రత్యేక దృష్టి పెట్టింది. భక్తులకు అవసరమైనప్పుడు నిమిషాల్లో వైద్యం అందేలా తిరుమలలో 16 వైద్య కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో అశ్విని ఆసుపత్రి ప్రధాన వైద్యశాల కాగా.. దీనికి అనుబంధంగా అపోలో హార్ట్ సెంటర్ పనిచేస్తోంది. వీటితో పాటు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్-6 ఎదురుగా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లోని ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ పక్కన, కల్యాణకట్ట, ఏటీసీ సర్కిల్, పీఏసీ-5, శ్రీవారి ఆలయం, అలిపిరి నడక మార్గంలోని 1500 మెట్టు, గాలి గోపురం, మిగతా .. 2లో..

మే 4న బెంగాల్‌లో

# స్వీట్లు పంచుతాం : మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. "గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలింది" అని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఇదిలా ఉండగా, బెంగాల్‌లో మొదటి విడత ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మిగతా .. 2లో..

ఐఏఎస్ అధికారి అహ్మద్ బాబుపై

# ఏపీ హైకోర్టు ఆగ్రహం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐఏఎస్ అధికారి, రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ అహ్మద్ బాబుపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వకపోవడంపై మండిపడింది. ఉద్యోగుల జీవితాలతో ఎలా ఆడుకుంటారని ప్రశ్నించింది. ప్రభుత్వం, సీఎస్ ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. పదోన్నతులపై వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. "పన్ను మిగతా .. 2లో..

తమిళనాడు, బెంగాల్‌లో

# రికార్డు స్థాయిలో పోలింగ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. తమిళనాడులో 84.69శాతం పోలింగ్ నమోదు కాగా, పశ్చిమ బెంగాల్ (తొలి విడత ఎన్నికలు)లో రికార్డు స్థాయిలో 91.78 శాతం నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. సాయంత్రం 6గంటలతో పోలింగ్ సమయం ముగియగా క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు. ఈ ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా.. ఎండను సైతం లెక్క చేయకుండా మిగతా .. 2లో..

# జడ్జి కావాలన్నదే లక్ష్యం

## ఫెమినా మిస్ ఇండియా సౌత్ విజేత ఇందు ఫల్గుణి



**ఖైరతాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫ్యాషన్ రంగంలో ఎంత ఎదిగినా.. తాను చదువుకే తొలి ప్రాధాన్యం ఇస్తానని 'ఫెమినా మిస్ ఇండియా సౌత్ 2026' విజేత చిలకలపూడి ఇందు ఫల్గుణి తెలిపారు. ప్రస్తుతం న్యాయశాస్త్రంలో కోర్సు చేస్తున్నానని.. భవిష్యత్తులో న్యాయ మూర్తి కావాలన్నదే తన లక్ష్యమన్నారు. గురువారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులు మిగతా .. 2లో..

# మహిళా హక్కులను విపక్షాలు కాలరాయలేవు

## కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఇటీవల మహిళా బిల్లును అడ్డుకున్నాయని, కానీ.. మహిళా హక్కులను అవి కాలరాయలేవని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఉత్తరాంధ్రలో పెట్టుబడుల పండుగే




2100 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. భూమిపూజ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."అనకాపల్లి జిల్లా భారీ పెట్టుబడులతో అభివృద్ధిని ఆకర్షిస్తోంది. పెట్టుబడుల్లో ఈ జిల్లా భారత్‌లోనే అగ్రస్థానానికి చేరుతుంది. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ ఇండియా స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. ఇప్పుడు రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ సంస్థ 6.5 గిగావాట్ల ఇన్ గాట్ సోలార్ వేఫర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రంగారెడ్డి జిల్లా వెనుకబడిన ప్రాంతం. కానీ ఇప్పుడు ఆ జిల్లానే అత్యంత సంపద కలిగిన ప్రాంతంగా మారింది. విశాఖ సమీపంలోని అనకాపల్లి మరో రంగారెడ్డి జిల్లాగా తయారవుతుంది. కేంద్ర మాజీమంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు సుమంత్ సిన్హా ఈ సోలార్ వేఫర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాన్ని ఎంచుకుని వ్యాపారం మొదలు పెట్టారు... ఇప్పుడు పెట్టుబడులు పెట్టడానికి ఏపీని ఎంచుకున్నారు. రెన్యూ ఎనర్జీ కేంద్ర కార్యాలయాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని ఆ సంస్థను కోరుతున్నాను. రెన్యూ ఎనర్జీనే కాదు... జాతీయ అంతర్జాతీయ సంస్థలను ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానిస్తున్నాం. ఏపీలో పెట్టుబడులు పెడితే సురక్షితంగా ఉంటాయి. ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నా. గడచిన 22 నెలల్లో 802 ఎంఓయూలు చేసుకున్నాం... వాటిపై నిరంతరం సంప్రదింపులు చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా అనుమతులు ఇస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ద్వారా సుపరిపాలన అందిస్తున్నాం. 2019-24 మధ్య పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు భయపడ్డారు. వేధింపులు, అవినీతి పెద్ద ఎత్తున జరిగింది. 2024లో మీరు వేసిన ఒక్క ఓటుతో ప్రజల్లో అభద్రత, ఆందోళనను తొలగించాం. ఎన్డీఏ బ్రాండ్‌తో ఏపీలో విశ్వాసం తిరిగి వచ్చింది. పరిశ్రమలకు, పెట్టుబడులకు భరోసా వచ్చింది. పారిశ్రామిక వేత్తలకు సహకరిస్తూ భూములు ఇచ్చిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉత్తరాంధ్రలో ప్రతి రోజూ పెట్టుబడుల పండుగ. ఈ నెల 28 తేదీన 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం. జూలైలో భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రాబోతోంది. లారస్ ల్యాబ్ రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ముందుకు వస్తోంది. ప్రధాని మోదీ సహకారంతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. రైల్వే జోన్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాం. విశాఖ-రాజమహేంద్రవరం మధ్య కార్గో కోసం నాలుగు రైల్వేలైన్ల స్పీడ్ రైల్ కారిడార్ వస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వేరే రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇతర రాష్ట్రాల నుంచే ఇక్కడికి వచ్చి ఉపాధి పొందే పరిస్థితి తెస్తాం. ఈ రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌తో నన్ను విశ్వసించిన యువతకు ఉద్యోగాలు వస్తున్నాయి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**రెన్యూవబుల్ ఎనర్జీతో జాతి నిర్మాణం**

"అభివృద్ధి సూచికల్లో విద్యుత్ వినియోగం కూడా ఓ భాగం. ఎంత విద్యుత్ వినియోగిస్తే అంత అభివృద్ధి సాధించినట్టే. అందుకే రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. గత పాలకులు విధ్వంసం చేసిన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మాణం చేయాలన్న లక్ష్యంతోనే కూటమి ప్రజా ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెన్యూ ఎనర్జీ వేలకోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. రాంబిల్లిలో సౌర ఫలకాలు తయారవుతాయి. విద్యుత్ సంస్కరణల్ని ప్రారంభించింది మేమే. ఆ ఫలితాలు అందరికీ అందుతున్నాయి. ఏపీలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 90 గిగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి చేసేలా పనులు గ్రౌండ్ అయ్యాయి. రూ.5.95 లక్షల కోట్లు ఈ రంగంలో పెట్టుబడులు వచ్చాయి., ఎంఓయూలు సిద్ధమైపోయాయి. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు వస్తోంది. గ్రీన్ ఈవీ వాహనాలు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాం. ఆర్టీసీ కూడా 1,050 బస్సులు తీసుకువస్తోంది. భవిష్యత్తులో ఆర్టీసీ బస్సులన్నీ ఈవీ బస్సులే. పేదలకు కూడా ఆర్టీసీ బస్సుల్లో తిరిగే సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తాం. రాష్ట్రంలో 5 వేల ఛార్జింగ్ స్టేషన్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయబోతున్నాం. ప్రతీ ఇంటిపైనా విద్యుత్ ఉత్పత్తి కోసం పీఎం సూర్యఘర్ కింద సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవాలి. 40 లక్షల ఇళ్లకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అటు రైతులు కూడా పీఎం కుసుమ్ కింద సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కడ ఉత్పత్తి చేసిన విద్యుత్ అక్కడే వాడుకునే పరిస్థితి ఉంటే ట్రాన్స్ మిషన్ నష్టాలు కూడా ఉండవు. రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తి అంటే... జాతి నిర్మాణమే. అలాంటి మంచి కార్యక్రమానికి సహకరిస్తున్న రెన్యూ సంస్థను అభినందిస్తున్నాను. ప్రస్తుతం యుద్ధం జరుగుతోంటే... గ్యాస్ కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దేశీయంగానే విద్యుత్ ఉత్పత్తి సహా ఇతర అంశాల్లో మనం ముందంజలో ఉంటే... అంతర్జాతీయంగా వచ్చే ఇబ్బందులను తట్టుకునే పరిస్థితి ఉంటుంది. అందుకే ప్రధాని మోదీ రెన్యూవబుల్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నారు."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**గత ప్రభుత్వ తప్పులను సరి చేస్తున్నాం...**

"పేదల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజలకు సుపరిపాలన అందేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ రంగం సహా వివిధ వ్యవస్థల్లో గత ప్రభుత్వ తప్పిదాలు సరి చేస్తున్నాం. 2019-24లో పీపీఏలు రద్దు చేసి, నిర్వహణా లోపంతో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసి విద్యుత్ వ్యవస్థను ధ్వంసం చేశారు. పీపీఏల రద్దు కారణంగా విద్యుత్ వాడుకోకుండానే రూ.9 వేల కోట్ల ప్రజాధనం కట్టాల్సి వచ్చింది. ప్రజలపై రూ. 32 వేల కోట్ల భారాన్ని గత పాలకులు వేశారు. ట్రూ అప్ ఛార్జీలు పేరుతో భారీగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారు. గత పాలకులు వేసిన ట్రూ అప్ ఛార్జీలను... మేం చరిత్రలో తొలిసారిగా ట్రూ డౌన్ అమలు చేశాం. దీంతో పాటు ట్రూ అప్ భారాన్ని కూడా ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరిస్తోంది. రూ.15,795 కోట్లు ఛార్జీల భారం పెంచకుండా ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకున్నాం. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకే నిలబెట్టుకుంటున్నాం. ఇప్పుడు మళ్లీ చెబుతున్నాం... విద్యుత్ ఛార్జీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచం. గత పాలకులు ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చారు. వాటిని రీషెడ్యూలు చేస్తున్నాం. అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నాం. రాజధాని అమరావతి నిర్మాణంతో రాష్ట్ర దశాదిశ మారుతుంది. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. విశాఖ సహా 9 జిల్లాలు, అమరావతి కేంద్రంగా పశ్చిమగోదావరి నుంచి ప్రకాశం వరకూ, తిరుపతి కేంద్రంగా రాయలసీమ అంతటా వివిధ రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. 2047 స్వర్ణాంధ్రతో హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధించడం ప్రజా ప్రభుత్వ లక్ష్యం"అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**హత్యలు చేస్తారు... సాక్షుల్ని బెదిరిస్తారు...**

"మంచి కార్యక్రమాలు... శుభ దినాల్లో కూడా తప్పుడు పనులు చేసే వారిని... దుర్మార్గులను గుర్తు చేసుకోవాలి. అలాంటి వారి విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి కాబట్టి... చెప్పాల్సి వస్తోంది. నేరాలు ఘోరాలు చేసే ఓ పార్టీ రాష్ట్రంలో అరాచకాలు చేస్తోంది. వివేకా హత్య తరహాలోనే కడపలో దస్తగిరి అనే వ్యక్తిని హత్య చేశారు. జగన్ మోహన్ రెడ్డి మేనమామకు ప్రధాన అనుచరుడు ఆస్తుల కోసం పెద్ద దస్తగిరిని చంపేశారు. డబ్బు కోసం, ఆస్తుల కోసం సొంత మనుషుల్ని సైతం కడతేర్చే కిల్లర్ పార్టీ అది. ఇలాంటి మోసగాళ్లపై నిరంతరం కన్నేసే ఉంచుతున్నాం. ప్రస్తుతం నేరస్థులతో రాజకీయం చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. డ్రైవర్‌ను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని ఎమ్మెల్సీగా చేశారు. ఇప్పుడు మళ్లీ అతనే సాక్షుల్ని బెదిరించే స్థాయికి చేరాడు. అలాంటి రాజకీయ పార్టీ ఐడియాలజీని ప్రజలు అర్థం చేసుకోవాలి. ఇలాంటి పార్టీలు సమాజానికి దూరం కావాలి. అధికారంలోకి వస్తే నరికేస్తాం, చంపేస్తాం, పెట్టుబడి దారులను తరిమేస్తాం అని బెదిరించే పార్టీలు మనకెందుకు..? అయినా వాళ్ల బెదిరింపులకు కాలం చెల్లింది. ఫ్లెక్సీలకు రక్తాభిషేకాలు చేసి అభద్రతా భావం సృష్టించే వాళ్లు రాజకీయాల్లో అవసరమా...? రాష్ట్రంలో మంచి జరుగుతోంటే... కిల్లర్ పార్టీకి ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోంది. నాడు ఉత్తరాంధ్రలో ప్రొక్లయినర్ తో కూల్చివేతలు జరిగేవి. నేడు అవే ప్రొక్లయినర్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. నాడు ఉత్తరాంధ్ర ప్రాంతంలో భూములను కబ్జాలు చేశారు. తప్పుడు రిజిస్ట్రేషన్లు చేశారు. కానీ నేడు అవే భూముల్లో ప్రపంచ స్థాయి కంపెనీలు వస్తున్నాయి... రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నాయి... శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రకృతి వనరులు దోచిన పాలకులకు... ప్రకృతి వనరులను సంపదగా మార్చే ప్రభుత్వాలకు మధ్యనున్న తేడాను ప్రజలంతా గమనించాలి."అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా, జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ట్రంప్ 'నరకం' వ్యాఖ్యలు..**

## స్పందించిన భారత్

చట్టాలేమో ఆ బిడ్డకు వెంటనే అమెరికా సిటిజన్‌షిప్ ఇస్తాయి. ఆ తర్వాత వారు తమ కుటుంబసభ్యులందరినీ చైనా, భారత్ లేదా మరేదైనా నరకం నుంచి ఇక్కడికి తీసుకొస్తారు" అని ఆ లేఖలో భారత్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు.

## 'భారత్ గొప్ప దేశం'..

ట్రంప్ రీ పోస్ట్‌చేయడం వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో భారత మీడియా నుంచి ప్రశ్నలు లేవనెత్తడంతో రాయబార కార్యాలయం వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఈ వివాదంపై భారత్ విదేశాంగ శాఖ కూడా స్పందించింది. 'ఆ కథనాలను మేం చూశాం. వాటిని అక్కడితో వదిలేస్తున్నాం' అని ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు.

**భాజపా సర్కార్ వస్తే..**

## బెంగాల్‌లోకి ఎవరూ చొరబడలేరు

చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. హుగ్లీ జిల్లాలోని బాలాగఢ్‌లో ఏర్పాటు చేసిన రెండో విడత ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. "మే 5న దీదీ ఆట ముగుస్తుంది. భాజపా ప్రభుత్వం పూర్తి మెజార్టీతో ఏర్పాటవుతుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, భద్రతకు చొరబాటుదారులు హాని కలిగిస్తున్నారు. బెంగాల్ యువత ఉద్యోగాలు, పేదల రేషన్‌ను దోపిడీ చేయడంతో పాటు దేశ భద్రతను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారు" అని ఆరోపించారు. "ఏప్రిల్ 29న (రెండో విడత ఎన్నికల్లో) కమలం గుర్తుపై ఓటేయండి. ఇది మీరు కేవలం ఎవరో ఒకరిని ఎమ్మెల్యేని చేసేందుకో, భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికో కాదు.. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించడానికి. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక బెంగాల్‌లోకి ఎవరూ చొరబడలేరు. ఇప్పటికే అక్రమ వలసదారులను భాజపా బయటకు పంపిస్తోంది" అని అన్నారు. మరోవైపు, బెంగాల్‌లో జరుగుతున్న తొలి విడత ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 3గంటల సమయానికి 78.77శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో ఈ రోజు ఉదయం 7గంటలకు పోలింగ్ మొదలైన విషయం తెలిసిందే.

**శ్రీవారి భక్తుల కోసం తిరుమలలో**

## 16 వైద్య కేంద్రాలు

రద్దీ సమయంలో నారాయణగిరి షెడ్ల వద్ద ఉన్న వైద్య కేంద్రాల్లో అన్ని వేళలా భక్తులకు వైద్య సేవలు అందనున్నాయి. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం, పీఏసీ-2, అలిపిరి పాదాల మండపం, ఏడో మైలు, భాష్యకార్ల సన్నిధి, రద్దీ ఎక్కువగా ఉన్న రోజుల్లో శిలాతోరణం, సేవా సదన్ వద్ద వైద్య కేంద్రాల్లో ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు, శ్రీవారి మెట్టులోని 1200 మెట్టు వద్ద ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. బ్రహ్మోత్సవాల సమయంలో రామ్ భగీచా-1, పాపవినాశనం వద్ద రెండు అదనపు వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అంతే కాకుండా మొబైల్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల ద్వారా భక్తులకు వైద్య సేవలు అందించేందుకు తితిదే సిద్ధమైంది. 9 అంబులెన్సులు కూడా అందుబాటులో ఉంచింది.

**128 మంది సిబ్బందితో నిరంతరాయంగా వైద్య సేవలు**

తిరుమలలో భక్తులకు వైద్య సేవలు అందించేందుకు 8 మంది డాక్టర్లు, 120 మంది పారా మెడికల్ సిబ్బందితో నిరంతరాయంగా వైద్య సేవలు అందుతాయని తితిదే పేర్కొంది. తిరుమలలోని అన్ని వైద్య కేంద్రాల్లో రోజుకు సగటున 2,400 మంది భక్తులు వైద్య సేవలు పొందుతున్నారు.

## అగ్ర వర్ణాల్లో పేదరికాన్ని రూపుమాపుతాం

కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. కొద్ది రోజుల కిందట ఎంఎస్ఎంఈ పార్కుల్లో వ్యాపార అవకాశాలపై మరో సదస్సు నిర్వహించామన్నారు. ఏయే రంగాల్లో ఆర్థిక వృద్ధి లభిస్తుందో వాటిపై ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవగాహన సదస్సులు కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు గౌరవప్రద జీవనమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. 2029 నాటికి 20 లక్షల ఉద్యోగా కల్పించి తీరుతామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 22 నెలల్లో ఏపీకి రూ.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. ఈ ఘనత అంతా సీఎం చంద్రబాబుది, మంత్రి లోకేశ్ దేనన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత 6.25 లక్షల ఉద్యోగాలు కల్పించామన్నారు. ఉద్యోగాల కల్పనే కాకుండా.. ప్రతి ఇంటి నుంచి పారిశ్రామిక వేత్తలను తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ప్రతి నియోజక వర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, ఆ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గానికి చెందిన యువతకు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కూడా పెద్దపీట వేస్తున్నామన్నారు. బీసీ కులాలతో పాటు అగ్ర కులాల్లో పేదరికాన్ని రూపు మాపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతకుముందు అర్చకుల వేదమంత్రోచ్ఛారణాల మధ్య కార్పొరేషన్ కార్యాలయాన్ని, ఛైర్మన్ ఛాంబర్ ను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మయ్య చౌదరి, ఇతర కార్పొరేషన్ ఛైర్మన్లు నందం అబద్ధయ్య, వీరంకి వెంకట గురుమూర్తి, మల్లె ఈశ్వరరావు, ఆప్కాస్ ఛైర్మన్ రాంప్రసాద్, పలువురు డైరెక్టర్లు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**నాదెండ్ల మనోహర్‌ని ఫోన్‌లో**

## పరామర్శించిన పవన్ కళ్యాణ్

పవన్ కళ్యాణ్ ఫోన్ చేసి పరామర్శించారు. ఈ విషాదం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భాస్కరరావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

**మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు పార్థివదేహానికి**

## నివాళులర్పించిన మంత్రి కందుల దుర్గేష్

పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, ఈ క్లిష్ట సమయంలో భగవంతుడు వారికి ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు.. అనంతరం అంత్యక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాప్రతినిధిగా, ముఖ్యమంత్రిగా నాదెండ్ల భాస్కరరావు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ ఈ తీవ్ర విషాదం నుండి వారి కుటుంబ సభ్యులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**మే 4న బెంగాల్‌లో**

## స్వీట్లు పంచుతాం : మోదీ

రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు కావాలని మోదీ ఓటర్లకు పిలుపునిచ్చారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు.

**ఐఏఎస్ అధికారి అహ్మద్ బాబుపై**

## ఏపీ హైకోర్టు ఆగ్రహం

వసూళ్ల విషయంలో అహ్మద్ బాబుపై ఆరోపణలు ఉన్నాయి. మాకే అధికారం ఉంటే వెంటనే ఆయన్ను సస్పెండ్ చేసే వాళ్లం. ఐఏఎస్‌గా కొనసాగేందుకు ఆయన అర్హతపై విచారణ జరిపిస్తాం. పిటిషనర్ వినతిపై ఏం చర్యలు తీసుకున్నారో సీఎస్ చెప్పాలి" అని హైకోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

**తమిళనాడు, బెంగాల్‌లో**

## రికార్డు స్థాయిలో పోలింగ్

భారీ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలి గంటల్లోనే పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పశ్చిమ బెంగాల్‌లో రికార్డు స్థాయిలో 91.78శాతం పోలింగ్ నమోదైందని, స్వాతంత్ర్యానంతరం ఇదే అత్యధికమని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. బెంగాల్‌లో మొత్తం 294 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. తొలి విడతలో 16 జిల్లాల్లోని 152 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈ దశలో 1,478 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. రెండో విడత పోలింగ్ ఈనెల 29న జరగనుంది.

తమిళనాడులో అత్యధికంగా 84.69శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 234 స్థానాలకు ఒకే దశలో పోలింగ్ జరిగింది. సాయంత్రం 6గంటల సమయానికి కరూర్ జిల్లాలో అత్యధికంగా 91.86శాతం పోలింగ్ నమోదైనట్లు సమాచారం. అలాగే, చెన్నైలో 83.09శాతం, మదురైలో 80.15శాతం, కోయంబత్తూరులో 84.40శాతం చొప్పున నమోదయ్యాయి.

సీఎం స్టాలిన్ బరిలో ఉన్న కొళత్తూర్‌లో 85.63శాతం పోలింగ్ నమోదు కాగా.. ఆయన తనయుడు, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ పోటీ చేస్తున్న చెపాక్-ట్రిప్లికేన్ నియోజకవర్గంలో 83.58శాతం పోలింగ్ నమోదైంది. ఈ సీటులో రెండోసారి ఉదయనిధి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. టీవీకే చీఫ్, సినీనటుడు విజయ్ బరిలో ఉన్న తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గంలో 81.55శాతం పోలింగ్ నమోదు కాగా.. ఆయన పోటీ చేస్తున్న మరో స్థానం పెరంబూరులో 89.20శాతం పోలింగ్ నమోదైంది. మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

## జడ్జి కావాలన్నదే లక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందినవారని.. వృత్తిరీత్యా హైదరాబాద్‌లోని శ్రీనగర్‌కాలనీలో ఉంటున్నట్లు తెలిపారు. తాను హైదరాబాద్‌లో పుట్టి పెరిగినా.. ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో ఏపీ నుంచి అవకాశం లభించిందన్నారు. ఇంట్లో తాత, నాన్న.. 'లా' చదవడం, వారి వృత్తిరీత్యా తనకూ ఆసక్తి పెరిగి న్యాయశాస్త్రంలో కోర్సు చేస్తున్నట్లు వివరించారు. ఫ్యాషన్ రంగంలోకి వెళ్లాలన్న ఆలోచన గతంలో లేదని.. ఏడాది కింద అవకాశం రావడం.. తల్లిదండ్రులూ నా ఇష్టానికే వదిలిపెట్టడంతో ఈ రంగంలో అడుగుపెట్టినట్లు తెలిపారు. గత జనవరిలో ముంబయి కేంద్రంగా ఆడిషన్స్ జరగగా.. ఫెమినా మిస్ ఇండియా పోటీలు భువనేశ్వర్‌లో జరిగినట్లు చెప్పారు. ఏపీ తరఫున 'ఫెమినా మిస్ ఇండియా సౌత్'గా గెలుపొందటం ఇదే తొలిసారని.. తానే కాకుండా అమ్మానాన్నలు, సోదరుడు వేదికపైకి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## మహిళా హక్కులను విపక్షాలు కాలరాయలేవు

విపక్షాలు ఇటీవల పార్లమెంటులో మహిళా బిల్లును అడ్డుకోవడాన్ని ఖండించారు. విజయవాడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రధాని మోదీ హయాంలోనే మరోసారి బిల్లును ప్రవేశపెట్టి మహిళలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. "2029 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలనే సదుద్దేశంతో ఇటీవల బిల్లు ప్రవేశపెట్టాం. కానీ.. పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రతిపక్షాలు కుట్రపూరితంగా వ్యతిరేకించాయి. ఈ పార్టీల నిజ స్వరూపాన్ని ప్రజలకు తెలియజెప్పేలా.. ముఖ్యంగా మహిళా లోకానికి తెలిసేలా దేశవ్యాప్తంగా జన ఆక్రోశ ర్యాలీలు, సభలు నిర్వహించనున్నాం. మహిళా రిజర్వేషన్ విషయంలో ఎన్డీయే కూటమికి చిత్తశుద్ధి ఉంది" అని తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## పిఠాపురం వర్మ.. తగ్గితేనే నెగ్గినట్టు!

పిఠాపురం వర్మ విషయం ఏపీలో ప్రతీ సారీ హాట్ టాపిక్ గా అవుతోంది. సోషల్ మీడియాలో వైరల్ కూడా అవుతోంది.పిఠాపురం వర్మ విషయం ఏపీలో ప్రతీ సారీ హాట్ టాపిక్ గా అవుతోంది. సోషల్ మీడియాలో వైరల్ కూడా అవుతోంది. పిఠాపురంలో ఏ కార్యక్రమం జరిగినా రెండు ప్రధాన పార్టీల మధ్యన ఐక్యత లేదన్న సందేశాన్ని సంకేతాన్ని ఇచ్చినట్లు అవుతోంది. తాజాగా డ్వాక్రా మహిళలకు ట్యాబులను పంపిణీ చేసే కార్యక్రమంలో ప్రోటోకాల్ పేరుతో వర్మ ఆయన అనుచరులు పాడా ప్రాజెక్ట్ అధికారిని నిలదీయడం ప్రతిగా మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు వర్గం అక్కడికి రావడంతో అది రాజకీయ సంఘర్షణ గా మారింది. చిలికి చిలికి గాలి వాన అయినట్లుగా వ్యవహారం ముదిరింది. ఆ మీదట పరస్పరం మీడియా ముందు సవాళ్ళు కూడా వర్మ అండ్ దొరబాబు చేసుకోవడంతో ఈ ఇష్యూ సోషల్ మీడియానూ ఊపేసింది. దాంతో టీడీపీ అధినాయకత్వం సీరియస్ అయింది అని అంటున్నారు.

డైలాగులతోనే వార్ : పిఠాపురం వర్మలో తనకు తగిన పదవి దక్కలేదని ఆవేదన ఉంది. అసహనం కూడా ఉంది. అయితే అది సమయానుకూలంగా బయటపడుతోంది అని అంటున్నారు. పైగా ఆయన మంటెక్కించే డైలాగులతో జనసేన వర్సెస్ టీడీపీగా రచ్చ అవుతోందని అంటున్నారు. తాను బయట నుంచి వచ్చిన వాడిని కాదని దత్తత తీసుకోలేదని పిఠాపురంలోనే పుట్టాను అని వర్మ పదే పదే చెప్పడం స్థానికంగా ఎవరిని ఇబ్బంది పెట్టకపోయినా తగలాల్సిన వారికి తగులుతున్నాయని అంటున్నారు. పిఠాపురంలో పోటీ చేసింది గెలిచింది ఎవరో కాదు జనసేన అధినేత పవన్ కళ్యాణ్. పైగా ఆయన ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు ఆయన పిఠాపురం వాసి కాదు అని పదే పదే అన్నట్లుగానే ఈ డైలాగులు ఉన్నాయని అంటున్నారు. ఇక ప్రోటోకాల్ విషయంలో పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం ఉందా అన్న చర్చ కూడా సాగుతోంది. టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న చోట కూడా వారిదే ఆధిపత్యంగా ఉంది కదా అని అంటున్నారు.

నిన్న పదవి ఇచ్చినా : ఇక నిన్నటికి నిన్ననే వర్మకు టీడీపీ అధినాయకత్వం పదవి ఇచ్చింది. ఆయన్ని రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శిగా చేశారు. దాంతో రానున్న రోజులల్లో ఆయనకు ఎమ్మెల్సీ పదవి అయినా లేదా మరేదైనా పోస్టు అయినా దక్కుతుందని అంతా అనుకున్నారు. కానీ వర్మ దూకుడుతో మళ్లీ మొదటికే మోసం వచ్చిందా అన్న చర్చ సాగుతోంది. టీడీపీ అధినాయకత్వం అయితే ఈ వ్యవహారం మీద సీరియస్ గా ఉంది అన్న వార్తలతో పాటు ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ని పిఠాపురంలో ఏమి జరుగుతోందో చూడమని అవసరమైన క్రమశిక్షణ చర్యలకు కూడా దిగాలని అధినాయకత్వం ఆదేశించింది అన్న వార్తల నేపథ్యంలో వర్మ రాజకీయ దూకుడు ఏ రకమైన పర్యవసానాలకు దారి తీస్తుంది అన్న చర్చ అయితే సాగుతోంది.

కూటమి జాగ్రత్తలు : ఏపీలో ఎక్కడ ఏమి జరిగినా అది మొత్తం కూటమి పార్టీల మధ్యన గ్యాప్ పెంచేదిగా ఉంటుందని భావిస్తున్నారు. దాంతోనే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు అని అంటున్నారు. వర్మ విషయం తీసుకుంటే సీనియర్ నాయకుడిగా ఆయన ఉన్నారు. అయితే రాజకీయంగా జోరు చేసే క్రమంలో ఆయన చేస్తున్న హాట్ కామెంట్స్ ఒక్కోసారి ఇబ్బందికరంగా మారుతున్నాయని అంటున్నారు.



ఈ సందర్భంగా ఆయన హితైషులు ఒక సూచన చేస్తున్నారు. అత్తారింటికి దారేది మూవీలో పవన్ చెప్పినట్లుగా ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో ఆలోచించి వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని కోరుతున్నారు. మరి ఫైర్ బ్రాండ్ కి మారు పేరు అయిన వర్మ వింటారా లేదా అన్నదే చూడాల్సి ఉంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## కుటుంబాన్ని కాటేసిన మృత్యువు

**తిరుపతి జిల్లాలో తల్లి, భార్యను చంపి.. వ్యక్తి ఆత్మహత్య**

**రైలు పట్టాలపై తల పెట్టి బలవన్మరణం – నాన్నా.. చనిపోవద్దని వేడుకున్న బిడ్డలు**

**రక్షించే క్రమంలో కుమార్తె, కుమారుడి దుర్మరణం**



**హరిత, మోహన్ దంపతులతో కుమారుడు కౌశిక్, కుమార్తె హరిణి**

**నారాయణవనం, విశ్వం వాయిస్ న్యూస్ :** కారణమేంటో తెలియదు.. ఒకే ఒక్కరోజు కొన్ని గంటల వ్యవధిలో ఓ కుటుంబం మొత్తాన్ని మృత్యువు కాటేసింది. తల్లి, భార్యను చంపిన ఓ వ్యక్తి.. తానూ రైలుపట్టాలపై తలపెట్టి బలవన్మరణానికి పాల్పడ్డాడు. తండ్రిని కాపాడబోయి కుమార్తె, కుమారుడు కూడా దుర్మరణం పాలయ్యారు. తిరుపతి జిల్లా నారాయణవనం మండలంలో బుధవారం ఈ పెను విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలకు కారణాలేమిటో తెలియకపోవడం మిస్టరీగా మారింది. నారాయణవనం మండలంలోని వెంకటకృష్ణపాలెం పంచాయతీ చాకలి వీధిలో మోహన్ తన భార్య హరిత (33), తల్లి చంద్రకళ (65), కుమారుడు కౌశిక్ (14), కుమార్తె హరిణి(12)తో నివాసం ఉంటున్నారు. పుత్తూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో కుమారుడు 9వ తరగతి, కుమార్తె 7వ తరగతి చదువుతున్నారు. మోహన్ నారాయణవనంలో సిమెంట్ షాప్, హరిత టైలరింగ్ షాప్ నడుపుతున్నారు. హరిత సోదరుడు బాలకృష్ణ కొద్ది రోజులుగా ఇక్కడే ఉంటూ బావతో కలిసి సిమెంటు దుకాణం చూసుకుంటున్నారు. మధ్యాహ్నం తనకు భోజనం తెస్తానని వెళ్లిన మోహన్ ఎంతసేపటికీ ఇంటి నుంచి రాకపోవడం, ఫోన్ చేస్తే స్విచాఫ్ అని రావడంతో బాలకృష్ణ బావ ఇంటికి వచ్చి చూశారు. అక్కడ చంద్రకళ, హరిత విగతజీవులుగా కనిపించారు. మోహనే ఇద్దరినీ చున్నీ మెడకు బిగించి హత్యచేశాడని పోలీసులు చెబుతున్నారు.

**మోహన్ కోసం గాలింపు**

బుధవారం ఉదయం 11 గంటల సమయంలో మోహన్ పాఠశాలకు వెళ్లి తన మామ చనిపోయాడని చెప్పి పిల్లలను తీసుకొచ్చినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే మోహన్ ఫోన్ స్విచాఫ్ అయి ఉండడంతో అతని ఆచూకీ కోసం పోలీసులు పుత్తూరు, కార్వేటినగరం, నగరి తదితర ప్రాంతాల్లో సాంకేతిక పరిజ్ఞానంతో గాలించారు. ద్విచక్రవాహనంపై పిల్లల్ని ఎక్కించుకుని చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తిరిగిన మోహన్ రాత్రి 7.15 గంటలకు పుత్తూరు మండలంలోని వేపగుంట రైల్వేస్టేషన్ సమీపంలో వాహనాన్ని ఆపి పిల్లలతో కలిసి పట్టాల వద్దకు వచ్చారు. ఒక్కసారిగా పట్టాలపై తల పెట్టారు. నిర్ఘాంతపోయిన కుమారుడు, కుమార్తె.. చనిపోవద్దని తండ్రిని వేడుకున్నారు. స్పందించకపోవడంతో ఇద్దరూ ఆయన్ను పక్కకు లాగే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే 100 కి.మీ వేగంతో వచ్చిన ఎగ్మోర్- కాచిగూడ రైలు వారు ముగ్గురినీ బలితీసుకుంది. ముగ్గురూ రైలు పట్టాలపై చనిపోయారని ఆ రైలు లోకోపైలట్ పుత్తూరు స్టేషన్ మాస్టర్‌కు సమాచారమిచ్చారు.

**వీడని మిస్టరీ :** మోహన్‌కు ఆర్థిక, కుటుంబపరమైన సమస్యలు లేవని చెబుతున్నారు. తన సోదరికి అప్పులు ఉండటంతో ఆమెకు ఇవ్వాలని మోహన్ బుధవారం ఉదయమే కొంత నగదు తెలిసిన వ్యక్తికి ఇచ్చారని చెబుతున్నారు. అలాంటి వ్యక్తి తల్లి, భార్యను ఎందుకు హత్య చేశాడన్నది స్థానికులు, పోలీసులకు అంతు పట్టడంలేదు. ఇద్దరి హత్యపై నారాయణవనం పోలీసులు కేసు నమోదుచేశారు. తండ్రి, ఇద్దరు బిడ్డల మృతిపై రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## దిల్లీ హత్యాచార కేసు.. బాధితురాలి వేలితో సేఫ్‌లాక్‌ను తెరవబోయి..



**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ రాజధాని దిల్లీలో సీనియర్ ఐఆర్ఎస్ అధికారి కుమార్తెపై గతంలో వారి ఇంట్లో పనిచేసిన వ్యక్తే హత్యాచారానికి పాల్పడటం సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసు విచారణలో తాజాగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. యువతిపై ముందు దాడి చేసి.. ఆ తర్వాత అత్యాచారానికి పాల్పడినట్లు నిందితుడు రాహుల్ మీనా విచారణలో అంగీకరించాడు. దాడి అనంతరం ఆ ఇంట్లో దోపిడీకి కూడా అతడు యత్నించినట్లు వెల్లడైంది. దర్యాప్తు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాహుల్ నేరుగా ఐఆర్ఎస్ అధికారి ఇంటి పైఅంతస్తులో ఉన్న స్టడీరూమ్‌లోకి వెళ్లాడు. అక్కడ బాధితురాలిపై లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించాడు. యువతి ప్రతిఘటించడంతో.. పక్కనే ఉన్న బలమైన వస్తువులతో ఆమెపై దాడి చేసినట్లు అతడు విచారణలో తెలిపాడు. తీవ్ర రక్తస్రావంతో స్పృహ కోల్పోయిన ఆమెపై.. అత్యాచారానికి పాల్పడినట్లు అంగీకరించాడు. అనంతరం అతడు ఇంట్లో దోపిడీకి కూడా యత్నించాడు. ఆ ఇంట్లో ఉన్న సేఫ్‌లాక్ బయోమెట్రిక్ సిస్టమ్‌తో పనిచేస్తుందని దర్యాప్తు అధికారులు గుర్తించారు. దాడి తర్వాత అచేతనంగా పడి ఉన్న బాధితురాలిని స్టడీరూమ్ నుంచి గ్రౌండ్‌ఫ్లోర్‌కు ఈడ్చుకొచ్చాడు. రక్తపు మరకలు ఉన్న ఆమె వేలితో సేఫ్‌లాక్‌ను తెరిచేందుకు ప్రయత్నించాడు. అది సాధ్యపడకపోవడంతో.. ఓ స్క్రూ డ్రైవర్‌తో సేఫ్‌లాక్‌ను ఓపెన్ చేసి అందులోని నగదు, బంగారాన్ని దొంగిలించాడు. వాటి మొత్తం విలువ రూ.2.5 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అనంతరం బాధితురాలిని అక్కడే వదిలేసి.. దుస్తులపై రక్తపు మరకలు పడటంతో అవి మార్చుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితురాలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

**వివాహితపై అత్యాచారం..!**

దిల్లీ ఘటనకు ముందురోజు రాహుల్ ఓ వివాహితపై అత్యాచారానికి పాల్పడ్డాడనే ఆరోపణలు ఉన్నాయి. రాజస్థాన్‌లోని అల్వార్‌లో తన ఇంటిపక్కన ఉన్న మహిళను అత్యాచారం చేసి.. విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని ఆమెను బెదిరించాడని, అనంతరం అక్కడినుంచి దిల్లీకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు పైనా దర్యాప్తు ప్రారంభించారు.

**15 బృందాల ఏర్పాటు..**

దిల్లీ ఘటనపై సమాచారం అందిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. 15 బృందాలుగా ఏర్పడి.. నిందితుడి కోసం విస్తృతంగా గాలించారు. స్థానికంగా ఉన్న సీసీటీవీలను పరిశీలించగా.. ఒక ఆటోలో రాహుల్ పరారయినట్లు గుర్తించారు. ఆటో డ్రైవర్‌ను విచారించిన అనంతరం ద్వారకాలోని ఓ హోటల్‌లో రాహుల్ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే అక్కడికి వెళ్లి.. అతడిని అరెస్టు చేశారు.

నైటీ ధరించిందని..

## భార్యకు నిప్పంటించిన భర్త

**బెళగావి, విశ్వం వాయిస్ న్యూస్ :** భార్య నైటీ వేసుకుంటే.. అతడికి ఎక్కడలేని కోపం వస్తోంది. 'ఇలాంటివి నాకు నచ్చవ్' అంటూ కటువుగా చెప్పడం మొదలుపెట్టాడు. 'ఇందులో తప్పేముందండీ..' అంటూ ఆమె చెప్పినా మింగుడు పడలేదు. ఎంతచెప్పినా ఇంట్లో నైటీ ధరిస్తోందని గొడవ పెట్టుకుని మంజులా పాటిల్ (30) అనే గృహిణిపై ఆమె భర్త కృష్ణాజీ పాటిల్ కిరోసిన్ పోసి నిప్పంటించాడు. కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లా ఖానాపుర తాలూకా నందగడలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆమెకు సుమారు 80 శాతం గాయాలు కాగా.. తొలుత స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం బ్రిమ్స్‌కు, అక్కడి నుంచి గోవాలోని ఆసుపత్రికి తరలించారు. ఎనిమిదేళ్ల కిందట వీరిద్దరికీ వివాహమైంది. నైటీ ధరించవద్దని ఆమెతో గొడవ పడుతూ వచ్చాడు. బుధవారం ఈ దారుణానికి ఒడిగట్టాడు. నందగడ ఠాణా పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

## హైదరాబాద్‌లోని ఏటీఎంలో వ్యక్తి మృతదేహం

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని మాసబ్‌ట్యాంకు ప్రాంతం ఏటీఎంలో వ్యక్తి మృతదేహం కలకలం సృష్టించింది. విజయనగర్ కాలనీలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏటీఎంలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న మెహదీపట్నం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు మరణం సంభవించిందా? ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు.

## బిడ్డకు జన్మనిచ్చి.. గొంతు కోసి..

**విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకలో దేవనహల్లిలోని ఫాక్స్‌కాన్ సంస్థకు చెందిన తయారీ ప్లాంటులో దారుణం చోటుచేసుకుంది. ఆ ప్లాంట్‌లో పనిచేస్తున్న 19 ఏళ్ల యువతి టాయిలెట్‌లో బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆ పసికందు గొంతు కోసి హతమార్చి ఓ సంచిలో పడేసింది. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది. ఆ యువతికి వివాహం కాలేదని, ఈ విషయం తెలిస్తే ఎక్కడ పరువు పోతుందోనని భయాందోళనతో అలా చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ రోజు డెలివరీ అవుతుందని ఆమె ఊహించకపోయి ఉండొచ్చని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. తరువాత మరొకరు వాష్‌రూమ్‌లోకి వెళ్లడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బిడ్డ పుట్టిన వెంటనే చంపేసినట్లు గుర్తించారు. బుధవారమే ఈ ఘటన జరిగింది. ప్రస్తుతం ఆ యువతికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనాల పైకి దూసుకెళ్లిన ట్రక్కు..

## 11 మంది సజీవదహనం



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఒక ట్రక్కు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొన్న ప్రమాదంలో 11 మంది సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లసోడా ప్రాంతం వైపు వెళ్తున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో అది ముందువెళ్తున్న కారును, కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళ్తున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో బొలేరోలోని 11మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మంటలను అదుపులోకి తీసుకొచ్చి.. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

ప్రతీ ఏడాది మీ అకౌంట్లోకి రూ.60 వేలు..

## కేంద్ర ప్రభుత్వం అదిరిపోయే స్కీమ్..



కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన పథకాన్ని ఎప్పటినుంచో అమలు చేస్తోంది. ఈ పథకంలో కొంత మొత్తంలో ప్రీమియం చెల్లిస్తే.. 60 ఏళ్ల తర్వాత నెలనెలా పెన్షన్ పొందవచ్చు. ప్రతీ నెలా రూ.5 వేల వరకు పెన్షన్ పొందే సౌకర్యం ఇందులో ఉంది. ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ అందుతుంది. అదే ప్రైవేట్ ఉద్యోగులకు ఈపీఎఫ్‌వో ద్వారా 60 ఏళ్ల తర్వాత నెలనెలా పెన్షన్ వస్తుంది. ఈపీఎఫ్‌వో సౌకర్యం లేనివారికి రిటైర్మెంట్ తర్వాత ఎలాంటి పెన్షన్ ప్రయోజనాలు ఉండవు. అంతేకాకుండా వివిధ రంగాల్లో పనిచేసేవారికి పీఎఫ్ సౌకర్యం అనేది ఉండదు. ఈ క్రమంలో అసంఘటిత రంగంలో పనిచేసేవారి కోసం కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో కొంతమొత్తంలో ప్రీమియం చెల్లిస్తే.. 60 ఏళ్ల తర్వాత పెన్షన్ పొందవచ్చు. ఈ పథకంలో ఎవరెవరు చేరవచ్చు..? ఎంత పింఛన్ వస్తుంది? అనే విషయాలు చూద్దాం.

**ఏడాదికి రూ.60 వేలు**

2015లో అటల్ పెన్షన్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు ఇందులో చేరేందుకు అర్హులు. 60 ఏళ్లు వచ్చేంతవరకు కొంత మొత్తంలో ప్రీమియం చెల్లిస్తే.. అందుకు సమానంగా ప్రభుత్వం మరికొంత చెల్లిస్తుంది. 60 ఏళ్ల తర్వాత మీకు నెలనెలా పెన్షన్ వస్తుంది. మీ చెల్లించే ప్రీమియంను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు పెన్షన్ పొందవచ్చు. అంటే ఏడాదికి రూ.12 వేల నుంచి రూ.60 వేల వరకు పొందవచ్చు. మీకు రూ.5 వేల పెన్షన్ కావాలంటే ప్రీమియం ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. అదే రూ.వెయ్యి కావాలంటే తక్కువ మొత్తంలో ఉంటుంది. ఇక మీ వయస్సును బట్టి కూడా ప్రీమియం మారుతూ ఉంటుది. చిన్న వయస్సులో చేరితే ప్రీమియం తక్కువగా ఉంటుంది. వయస్సు పెరిగే కొద్ది చేరితో ప్రీమియం ఎక్కువగా ఉంటుంది. మీ సమీపంలోని ఏదైనా బ్యాంక్‌కు వెళ్లి ఈ పథకంలో చేరవచ్చు. లేదా పోస్టాఫీస్ ద్వారా అయినా చేరవచ్చు. ప్రీమియం మీ అకౌంట్ నుంచి ఆటోమేటిక్‌గా డెబిట్ అవుతుంది. అలాగే 60 ఏళ్ల తర్వాత మీ అకౌంట్లోనే నెలనెలా పెన్షన్ జమ అవుతుంది.

**60 ఏళ్ల తర్వాత మరణిస్తే..**

ఒకవేళ పథకంలో చేరిన వ్యక్తి 60 ఏళ్ల తర్వాత మరణిస్తే జీవిత భాగస్వామికి ప్రతీ నెలా పెన్షన్ లభిస్తుంది. జీవిత భాగస్వామి మరణించేంత వరకు పెన్షన్ వస్తుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 13.5 మిలియన్ల మంది కొత్తగా అటల్ పెన్షన్ యోజనలో చేరారు. 2026 ఏప్రిల్ 21 నాటికి 9 కోట్ల మందికి చేరుకోగా.. ఇది ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ పథకాన్ని నిర్వహిస్తోంది. ఈ పథకం ద్వారా రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక భరోసా అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు లభిస్తుంది.

## ఏసీ కొనాలనుకుంటున్నారా?

**3 స్టార్, 5 స్టార్ మధ్య తేడా తెలియకపోతే కరెంట్ బిల్లు షాక్ ఇస్తుంది!**

### బిజినెస్ వాయిస్

వేసవి వేడి నుండి ఉపశమనం కోసం కొత్త ఏసీ కొనడం మంచి నిర్ణయమే. కానీ, సరైన అవగాహన లేకుండా ఏసీని ఎంచుకుంటే అది మీ నెలవారీ బడ్జెట్‌ను దెబ్బతీస్తుంది. కొత్త ఏసీ కొనాలనుకునే వారు విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడానికి నాలుగు ఖరీదైన పొరపాట్లను నివారించాలి. ముఖ్యంగా 2026లో అమల్లోకి వచ్చిన కొత్త ఎనర్జీ నిబంధనల ప్రకారం మీరు గమనించాల్సిన అంశాలు ఇప్పుడు చూద్దాం.. 2026లో కొత్త ఎయిర్ కండీషనర్ కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు చేసే 4 ప్రధాన పొరపాట్లు, వాటి వల్ల పెరిగే విద్యుత్ బిల్లుల గురించి ముఖ్యమైన సమాచారం ఇక్కడ ఉంది. ముఖ్యంగా బిఇఇ కొత్త నిబంధనలు అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి.

**గది పరిమాణం, ఏసీ టన్నుల మధ్య తేడా:** చాలా మంది గది పెద్దదా, చిన్నదా అని చూడకుండా ఏసీని కొంటారు. గది చిన్నదైతే 1 టన్ను, మధ్యస్థంగా ఉంటే 1.5 టన్ను ఏసీ సరిపోతుంది. తక్కువ కెపాసిటీ ఏసీని పెద్ద గదిలో పెడితే, గది చల్లబడటానికి కంప్రెసర్ నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. దీనివల్ల కరెంట్ బిల్లు విపరీతంగా పెరుగుతుంది.

**కొత్త బిఇఇ స్టార్ రేటింగ్స్ (2026 నిబంధనలు):** భారత ప్రభుత్వం 2026 నుండి ఏసీల స్టార్ రేటింగ్ నిబంధనలను కఠినతరం చేసింది. 2024 లేదా 2025 నాటి 5-స్టార్ ఏసీ, కొత్త నిబంధనల ప్రకారం 3 లేదా 4-స్టార్‌కే పరిమితం కావచ్చు. కాబట్టి, ఏసీ కొనేటప్పుడు అది 2026 తయారీ మోడల్ అవునా కాదా అనేది తప్పక సరిచూసుకోవాలి.

**ఇన్వర్టర్ వర్సెస్ నాన్-ఇన్వర్టర్:** నాన్-ఇన్వర్టర్ ఏసీలు ప్రారంభంలో తక్కువ ధరకు లభించినప్పటికీ, అవి ఎక్కువ విద్యుత్‌ను వినియోగిస్తాయి. ఇన్వర్టర్ ఏసీలు గది ఉష్ణోగ్రతకు అనుగుణంగా కంప్రెసర్ వేగాన్ని సర్దుబాటు చేస్తాయి. దీనివల్ల 30శాతం నుండి 40శాతం వరకు కరెంట్ ఆదా అవుతుంది.



ఇన్‌స్టాలేషన్, అదనపు ఖర్చులు: ఏసీ ధరతో పాటు కాపర్ పైపులు, స్టాండ్, వైరింగ్, స్టెబిలైజర్ ఖర్చులను కూడా లెక్కించాలి. నాణ్యత లేని ఇన్‌స్టాలేషన్ వల్ల గ్యాస్ లీక్ అయ్యే ప్రమాదం ఉంది. ఇది రీఫిల్లింగ్ ఖర్చులను పెంచుతుంది. అందుకే ఏసీ కొనేటప్పుడు కేవలం మిషన్ ధరనే చూడటం కాదు..ఇన్‌స్టాలేషన్, మెయింటెనెన్స్ ఖర్చులను కూడా లెక్కలోకి తీసుకోవాలి. ఏసీ కొనేటప్పుడు కేవలం ఇప్పటి ధరనే కాకుండా, రాబోయే పదేళ్ల విద్యుత్ బిల్లులను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. 5-స్టార్ ఇన్వర్టర్ ఏసీ కొంచెం ఖరీదైనదైనా, అది ఇచ్చే పొదుపు మీ పెట్టుబడిని రెండేళ్లలోనే తిరిగి ఇస్తుంది. పైన చెప్పిన పొరపాట్లను నివారించడం ద్వారా ఏటా వేల రూపాయల విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.



### ఉద్యోగం మండపేట... అభివృద్ధి కాంట్రాక్టులు

# మన గుంటూరోళ్లకే...

**మనం మనం భరంపురం... మనోళ్ళందరికీ కాసుల వరం - విసిగెత్తుపోతున్న ఉద్యోగస్తులు, ప్రజలు**

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పురపాలకసంఘం పేరు చెబితే జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తొచ్చేది అవార్డుల మోత, ప్రజాప్రతినిధులకు గౌరవం, ప్రజల ద్వారా వసూళ్లైన పన్నులను సక్రమమైన రీతిలో అభివృద్ధికి బాటలు వేసే పురపాలక సంఘం ఒకే ఒక్క మండపేట అని కమీషనర్ మరియు సంచాలకులు పురపాలక పరిపాలన కార్యాలయము, ఆంధ్రప్రదేశ్ వారు గొప్పగా చెబుతుంటారు. అలాంటి మండపేట గడిచిన సంవత్సర కాలం నుంచి గాడితప్పి ప్రజా ప్రతినిధులైన కౌన్సిల్ మాట లెక్కచేయకుండా శాసన సభ్యులను కూడా ప్రజల్లో మరి ముఖ్యంగా నిరుద్యోగ యువత దృష్టిలో దిగజార్చే విధంగా కొనసాగుతున్న విధానాల పట్ల అసహనం వ్యక్తపరిస్తున్న నేటి యువకులు, విశ్రాంతి సీనియర్ మున్సిపల్ ఉద్యోగస్తులు. ఘనకీర్తి ఘటించిన మండపేట కి ఏమైందని విశ్వంవాయిస్ ప్రజాభిప్రాయ సేకరణ తీసుకోగా బ్రిటిష్ వారు మనదేశానికి ఏవిధంగా వచ్చి సంపదను కొల్లగొట్టుకుని తీసుకెళ్లారో అదే రీతిలో కొద్ది నెలల నుంచి ఇక్కడ ప్రజల నుండి 16 వేల 600 కి పైగా ఉన్న అసిస్మెంట్ల ద్వారా 6.64 కోట్లు వసూలైన పన్నులలో ప్రచార నిమిత్తం కేటాయించిన సొమ్ము చాకచక్యంగా జిల్లా జిల్లాలు దాటి తరలిపోతున్నాయని స్థానికులు ముక్కునవేలేసుకుంటున్నారు. స్థానిక యువకులైతే మండపేట సొమ్మును ఇక్కడే ఉపయోగకరంగా చేయకుండా దూరపు కొండలు నునుపు అనే విధంగా ప్రవర్తిస్తున్న ఇలాంటి అధికారిని కొనసాగించడం పట్ల శాసన సభ్యులను కూడా బాధ్యులను చేస్తూ ఆవేదనను వెళ్ళగక్కుతున్నారు. స్థానిక సీనియర్లు మాత్రం మున్సిపల్ కమీషనర్ అవగాహనతో కూడిన విధానాలు ఆచరించడం లేదని టెండర్ల ప్రక్రియతో నిరుస్సాహపరుస్తున్నారని బాహాటంగానే ప్రస్తావిస్తున్నారు. మరింత లోతుగా ప్రజల నుండి విశ్లేషణ కోరగా... పట్టణ ప్రజలు ఎప్పుడూ విజ్ఞులని వారు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులను 75 శాతం మంది ఎప్పటికప్పుడు ఇంటి పన్నులు సక్రమంగా చెల్లిస్తుంటారని ఎటువంటి హంగులు ఆర్భాటాలు ప్రచారాలు అవసరం లేదని అందుబాటులో ఉన్న డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్ (డిసిబి) గతానివి చూస్తేనే అర్థమవుతుందని, చెబుతూ ఎప్పుడు ఇక్కడ లేని విధంగా కొత్త కొత్త విధానాలైన పన్ను బాకీదారుల పేర్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చెయ్యడం, నెలకి 45 వేల రూపాయలు ఖర్చుతో కూడుకున్న నాలుగు చక్రాల జీప్ లతో అధిక మొత్తంలో ప్రజాధనాన్ని రూల్స్ పేరుతో సుమారు 6 లక్షల రూపాయలుకు పైగా దుర్వినియోగం జరుగుతుందన్నారు. ఇంతటి ప్రజా ధనాన్ని అనవసరంగా ఖర్చు చేస్తూ పురపాలక సిబ్బందిని గాబరా పెటుతూ గడిబిడి గందరగోళం సృష్టించడమే తప్ప సాధించింది మాత్రం 72 శాతం వసూళ్లు మాత్రమేనన్న నిజం ఉన్నతాధికారులకు ప్రభుత్వ నాయకులకు తెలిసి కూడా ఎందుకు ఈ వింత పోకడలు చేస్తున్న కమిషనర్ ని భారాయిస్తున్నారో అంతుచిక్కడం లేదని బాహాటంగానే అంటున్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ లో రాష్ట్రంలో పన్నులు వసూళ్లలో మొదటి రెండవ స్థానాలు కైవసం చేసుకున్న వినుకొండ 85 శాతం, రాజం 81శాతం తోను, మూడవ స్థానంలో అద్దంకి 80 శాతం వసూళ్లు చేసిన పురపాలక సంఘాలు కూడా అక్కడ ప్రజలకు విపులంగా వివరించి వసూళ్లు చేసుంటారే తప్ప వింత పోకడలతో ఇబ్బందికి గురిచేసియుండక పోవచ్చు అందుకే వసూళ్లు జరుగుంటాయి అని అభిప్రాయాన్ని తెలిపారు. మండపేట పట్టణంలో నిరుద్యోగ యువత ఎవరికి టెండర్ ప్రక్రియ తెలియదనట్లు తెలియకూడదని జిల్లా దాటి గుంటూరు చుట్టుప్రక్కల ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఏపీ07 ఖ 7676 నెంబరు గల బినామీ వాహనంతో పాటు శానిటేషన్ విభాగంలో కూడా ఇదే పద్ధతిలో చెత్త నుండి కూడా సంపాదనను పొందవచ్చు అని గుంటూరు వాహనదారులకు అవకాశాన్ని కల్పించేంత పరిజ్ఞానవంతుడైన కమీషనర్ ద్వారా పట్టణ నిరుద్యోగ యువతకు పట్టణంలో నివాసముంటున్న స్థానిక శాసన సభ్యులు అవకాశాలు ఇచ్చుంటే బాగుండేదని కంచి పట్టు చీరలు గద్వాల్ చీరలు జ్యూలరీ ప్రచారాలకు చెల్లుచీటి పూర్తయ్యింది. కావున స్పెషల్ ఆఫీసర్ గా వచ్చిన ప్రాంతీయ పురపాలక పరిపాలనా సంచాలకులు, రాజమహేంద్రవరం వారికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పట్ల ఉన్న అపార అనుభవంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా గడిబిడి పద్ధతికి, అనవసరపు ఖర్చులకు స్వస్తి చెప్పి శాసనసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు తో చర్చించి ప్రాజాభిష్టానికి అనుగుణంగా ముందుకు సాగుతారని ప్రజలు ఆశిస్తున్నారు.

# పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రశాంత్ కుమార్

**ఐటిడిఏ పిఓ, సబ్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు**



**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వేదమంత్రాలతో నూతన పోలవరం జిల్లా మొట్టమొదటి జాయింట్ కలెక్టర్ పదవి బాధ్యతలు సూరపాటి ప్రశాంత్ కుమార్ స్వీకరించారు. గురువారం పోలవరం జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ గా,ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా పురోహితులు అద్దంకి వెంకటేశ్వరరావు వేదమంత్రాలతో ఐటీడీఏ కార్యాలయ జాయింట్ కలెక్టర్ వారి చాంబర్లో నూతన జాయింట్ కలెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నూతన పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు ముందుగా పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ వారిని కలిసి నూతన జాయింట్ కలెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరించడం జరిగిందని ఆయన తెలిపారు. పోలవరం జిల్లాలోని గిరిజనుల సమస్యలు, రెవెన్యూ సమస్యలు, సివిల్ సప్లై సమస్యలు, వివిధ రకాలైన సామాజిక పింఛన్లు, ప్రభుత్వ నిబంధన ప్రకారం పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకొని ప్రజల సమస్యలు ప్రభుత్వ నిబంధన ప్రకారం దరఖాస్తుదారుల అర్హతలను బట్టి పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.నూతన జిల్లా జాయింట్ కలెక్టర్ వారిని జిల్లా రెవెన్యూ అధికారి పి అంబేద్కర్, ఏపీఓ జనరల్ డి ఎన్ వి రమణ, ఐటీడీఏ పరిపాలన అధికారి ఎర్రంశెట్టి రాజు. డిప్యూటీ తాసిల్దార్ పృద్వీ వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు కార్యాలయ సిబ్బంది తదితరులు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికి బొకేలు అందజేసి నూతన జాయింట్ కలెక్టర్ వారికి స్వాగతం పలికారు.

# రంపచోడవరంలో దళిత నాయకుల నిరసన జ్వాల

**ఎమ్మెల్సీ అనంతబాబును వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ - దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్ష్యాల తారుమారు కుట్రలు ఉద్దేశ్య పూర్వక ద్రోహమే**

**డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితులైన అనంత బాబు అతని భార్యను, సహకారులను శిక్షించాలి**

**సాక్షులను ప్రలోభాలకు గురిచేయడం .. బెదిరింపులకు పాల్పడటం కిరాతకం**

**అనంత బాబు అతని భార్య లను తక్షణమే అరెస్ట్ చేయాలన్న దళిత నేతలు, కూటమి శ్రేణులు**



**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్సీపీ నేత, దళిత ద్రోహి అనంతబాబును వెంటనే అరెస్టు చేయాలని దళిత నాయకులు మరియు కూటమి పార్టీ శ్రేణులు భారీ నిరసన చేపట్టారు. దళిత ద్రోహి అనంత సత్య ఉదయ్ భాస్కర్ ,అతని భార్య, సహకారులను వెంటనే అరెస్ట్ చేయాలని రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్ ఆధ్వర్యంలో రంప చోడవరం అంబేద్కర్ విగ్రహం ఎదుట గురువారం భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు అడబాల బాపిరాజు, గోళ్ల చంటిబాబు తదితరులు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ అనంత బాబు తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్ష్యాలను తారుమారు చేయడానికి తీవ్రమైన కుట్రలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు. కోర్టులో తమకు అనుకూలంగా సాక్ష్యం చెప్పకపోతే చంపేస్తామని, డబ్బులు తీసుకుని నోరు మూసుకుని ఉండాలని, లేని పక్షంలో శవాలు కూడా దొరకవని సాక్షులను అనంతబాబు అనుచరులు భయ పెడుతున్నారని వారు ఆరోపించారు. ఈ కేసును నీరుగార్చడానికి సాక్షులకు 3 లక్షల రూపాయల సుపారీ ఆశ చూపించి, ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున అడ్వాన్స్‌గా బలవంతంగా అందజేశారని, ఈ విషయం మృతుడు సుబ్రహ్మణ్యం తమ్ముడు వీధి నవీన్ ద్వారా బయటకు వచ్చిందని పేర్కొన్నారు. గత ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో దళితులపై దాడులు పెరిగాయని, హంతకులను కాపాడటమే వైసీపీ నైతికతగా మారిందని నేతలు విమర్శించారు. గతంలో పోలీసులు ఉద్దేశ పూర్వకంగానే సాక్ష్యాలను దాచిపెట్టారని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిట్ విచారణలో అనంతబాబు మరియు ఆయన భార్య లక్ష్మీదుర్గ ప్రమేయం స్పష్టంగా తేలిందని వివరించారు. అలాగే అనంతబాబు నేర చరిత్రను చూసి సుప్రీంకోర్టు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేసిందన్నారు, నిందితుడితో పోలీసులు కుమ్మక్కయ్యారని ఘాటు వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో అప్పటి అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2022లో సుబ్రహ్మణ్యాన్ని అతి దారుణంగా కొట్టి చంపి, మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసి, దానిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని వారు గుర్తు చేశారు. సాక్ష్యాలను తారుమారు చేస్తూ పరారీలో ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబును తక్షణమే అరెస్ట్ చేసి, బాధితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ముక్తకంఠంతో దళిత నాయకులు, కూటమి శ్రేణులు డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యక్తులు సమాజంలో తిరిగే అర్హత లేదని వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, దేవీపట్నం మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల చంటిబాబు, సీతపల్లి గడి బాపనమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ కుంజం బాపన్న దొర, ఎఎంసి వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, సీతపల్లి గడి బాపనమ్మ తల్లి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు సిద్ధా వెంకన్నదొర, కారు లక్ష్మి, పెంటమ్మ, నియోజక వర్గ ఎస్టీ విభాగం అధ్యక్షులు పండా చెల్లన్న దొర అనే బాబీ, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, తెదేపా గంగవరం మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి, బొగ్గుల లక్ష్మి, క్లస్టర్ ఇంచార్జి కారం సింహాచలం, ప్రధాన కార్యదర్శి కోసు నాగన్నదొర, రంప చోడవరం ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులు షేక్ చోటు, మాజీ సర్పంచ్ నిరంజనీదేవి, మారేడుమిల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు మళ్ల దుర్గా ప్రసాద్, సాదల సత్య,దేవీపట్నం సారపు రాయుడు , నీలపు సూరిబాబు, మాజీ ఎంపీటీసీ మనోహర్, కారం పోశమ్మ, రేలంగి రాంబాబు, పతివాడ రమణ, కడబాల గణపతి, గల్లా సత్యనారాయణ, బుడ్డిగ రాజేంద్ర ప్రసాద్, సురేష్, మంగ, కూర తమన్నదొర, అడ్డతీగల క్లస్టర్ ఇంచార్జి బి.సత్యనారాయణ, గంగవరం మండలపార్టీ ప్రధాన కార్యదర్శి కనిగిరి సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురం పోస్టల్ సిబ్బందికి ఘన సత్కారాలు

**టాప్-3లో అమలాపురం పోస్టల్ డివిజన్ : ఎస్పీ శ్రీకర బాబు ప్రశంసలు**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అమలాపురం పోస్టల్ డివిజన్ ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధించిన బిజినెస్ రివ్యూ సమావేశం అల్లవరం నందుగల బీజీఎంవీ ఫంక్షన్ హాల్‌లో అమలాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ శ్రీకర బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకర బాబు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో అమలాపురం డివిజన్ వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ స్థాయిలో టాప్-3 డివిజన్లలో స్థానం సంపాదించడానికి కృషి చేసిన పోస్టల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి నిర్దేశించిన లక్ష్యాలను వివరించి, వాటిని సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోస్టల్ ఉద్యోగులను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సమావేశంలో అమలాపురం అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె. శ్రీధరం, పోస్టల్ ఇన్స్పెక్టర్లు ఎల్. శ్రీనివాస్, చే. కోటేశ్వరరావు, కె. అమర్నాథ్, సన్నీ రాజు తదితరులు పాల్గొన్నారు. అమలాపురం డివిజన్‌కు చెందిన పోస్టల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశం అనంతరం సూపరింటెండెంట్ శ్రీకర బాబును పోస్టల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

# గొల్లపల్లి అమూల్యని సన్మానించిన మంత్రి సుభాష్



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజోలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఈరోజు రాజోలు నియోజకవర్గం విచ్చేసిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య. ఇటీవల రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులైన అమూల్యని దుస్సాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించి శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి వాసంశెట్టి. పార్టీ ఇన్చార్జ్ గా వచ్చిన అనతి కాలంలోనే రాష్ట్ర పార్టీలో చోటు దక్కించుకోవడం మీ పని తీరుకు అద్దం పడుతుందని ఇదే విధంగా రాబోవు కాలంలో అనేక ఉన్నత పదవులను చేపట్టాలని అమూల్యని మంత్రి వాసంశెట్టి అభినందించారు.

### సెలవుల్లో తీసుకోవాల్సిన

# జాగ్రత్తలు సూచనలు ఇచ్చిన ఆర్ఐ నరేష్

**శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా ఫ్యామిలీ ఫెస్టలు**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం శ్రీ చైతన్య స్కూల్లో న్యూ అడాప్షన్ ప్రోగ్రాంలో భాగంగా గత వారం రోజులుగా ఫ్యామిలీ ఫెస్ట్ కార్యక్రమలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ జగదీష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రీజనల్ ఇంచార్జ్ ఎంవిఎల్ నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులు క్రమశిక్షణగా తల్లిదండ్రులు పట్ల గురువుల పట్ల గౌరవం కలిగి ఉండి ఉన్నత పౌరులుగా ఉండాలని ఉన్నత విలువలతో సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులు చదువుల్లో రాణించాలని తెలియజేశారు. అలాగే వేసవి సెలవుల్లో విద్యార్థులు ఏ విధంగా ఉండాలి అనే సూచనలు సలహాలు చేశారు. సమయాన్ని వృధా చేయకుండా ఆటపాటలతో పాటు వ్యాయామాలు యోగా మెడిటేషన్ లాంటి వాటితో పాటు కంప్యూటర్ స్కిల్స్ పైన ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నాము ఆ సబ్జెక్టుల్లో పట్టు సాధించే విధంగా మెలుకవులు నేర్చుకోవాలని, ఏదైనా డౌట్స్ ఉన్నా ఆయా సంబంధిత టీచర్లు ఫోన్లో అందుబాటు ఉంటారని పేర్కొన్నారు. ముఖ్యంగా బాయ్స్ గోదావరి కాలువల కు దూరంగా ఉండాలని అధిక వేడిమి ఎండల వల్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు చెబుతూ చిన్నతనం నుంచే ఇంటి పనిలో తగు తర్ఫీదు నివ్వాలని, వారు సూచించారు. ఈ కార్యక్రమల్లో సభకు హాజరైన తల్లిదండ్రులను గౌరవంతో విద్యార్థులు పాదపూజ చేసి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఇంచార్జ్ ప్రైమరీ మరియు ప్రీ ప్రైమరీ ఇన్చార్జిలతో, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

# ఏజెన్సీలో 1/70 యాక్ట్‌కు తూట్లు

**ఇందుకూరు రెవెన్యూ పరిధిలో అర్ధరాత్రి అక్రమంగా మట్టి తరలిస్తున్న ప్రోక్లైను, రెండు ట్రాక్టర్లు సీజ్ చేయండి**


**రంపచోడవరం డివిజన్ ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ నాయకులు పిట్ట ప్రసాద్**



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇందుకూరు రెవెన్యూ పరిధిలో గత మూడు రోజులుగా ఒక ప్రోక్లైన్ రెండు ట్రాక్టర్లతో వైసిపి పార్టీకి చెందిన నాయకుడు సాయంత్రం 8గంటల నుండి ఒంటిగంట వరకు విచ్చలవిడిగా మట్టి తరలిస్తున్నాడు.మట్టి తరలింపుకి ఎటువంటి అనుమతులు లేనప్పటికీ మట్టి మాఫియా మాత్రం రెచ్చిపోతుంది. ఇందుకూరు రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 292/2 నుండి అర్ధరాత్రి అక్రమంగా మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రెవిన్యూ శాఖ అధికారులు ఎంక్వయిరీ చేసి జెసిపి రెండు ట్రాక్టర్లు పైన తక్షణమే చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని 1/70 యాక్టును తుంగలో తొక్కుతున్న అక్రమార్కుల పైన కేసులు నమోదు చేయాలని రంపచోడవరం డివిజన్ ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ నాయకులు పిట్ట ప్రసాద్ పత్రిక ముఖంగా కోరారు.

**స్పందించకపోతే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తాము**

ఇందుకూరు రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 292 /2లో అక్రమంగా అర్ధరాత్రి మట్టి తవ్వకాలు పైన రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోతే సోమవారం జిల్లా కలెక్టర్ వారికి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడం జరుగుతుందని రంపచోడ వరం డివిజన్ ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ నాయకులు పిట్ట ప్రసాద్ పత్రిక ముఖంగా తెలియజేశారు.




# మహర్షి భగీరథ జయంతి ఘనంగా నిర్వహణ

## భగీరథుని పట్టుదల యువతకు ఆదర్శం : జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

మహర్షి భగీరథుని పట్టుదల, సేవాభావం అందరికీ ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమికి తీసుకువచ్చిన మహనీయుడు భగీరథుడని కొనియాడారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో మహర్షి భగీరథుని 776వ జయంతి సందర్భంగా బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ భగీరథుని చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు భగీరథ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. తన పితృదేవతల ఆత్మశాంతి కోసం, లోక కల్యాణం కోసం కఠోర తపస్సు చేసి గంగను భూమికి తీసుకువచ్చిన భగీరథుని కృషి అపూర్వమని చెప్పారు. అందుకే నేటికీ గొప్ప ప్రయత్నాన్ని 'భగీరథ ప్రయత్నం'గా పేర్కొంటారని తెలిపారు. లక్ష్యంపై అంకితభావం, పట్టుదల ఉంటే



ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చని, భగీరథుని జీవితం యువతకు గొప్ప పాఠమని అన్నారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం భగీరథ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నదని, ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొని వేడుకలను విజయవంతం చేస్తున్నారని తెలిపారు. భగీరథుని ఆశయాలకు అనుగుణంగా నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోతిలక్ష్మి దేవి మాట్లాడుతూ భగీరథుని పేరు వినగానే గంగానదిని భూమికి తీసుకువచ్చిన ఘనత గుర్తుకు వస్తుందన్నారు. సగర చక్రవర్తి వంశంలో జన్మించిన భగీరథుడు, తన పితృదేవతలకు సద్గతి కల్పించాలనే సంకల్పంతో హిమాలయాల్లో కఠోర తపస్సు చేసి బ్రహ్మదేవుడు, అనంతరం శివుడిని ప్రసన్నం చేసి గంగను భూలోకానికి తీసుకువచ్చాడని వివరించారు. గంగా నది శివుని జటాజూటం ద్వారా ప్రవహించి, జహ్ను మహర్షి ఆశ్రమం దాటి చివరకు సగరుని కుమారుల చితాభస్మంపై ప్రవహించి వారికి సద్గతి కలిగించిందని పురాణాలు చెబుతున్నాయని తెలిపారు. భగీరథుడు పట్టుదల, దీక్ష, సహనం, లక్ష్యసాధనకు ప్రతీకగా నిలిచాడని, ఆయన జీవితం సేవాభావం, సంకల్పబలం, ధర్మనిష్ఠలకు గొప్ప ఉదాహరణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంకి కొత్తపేట ప్రజల తరపున

# హృదయ పూర్వక కృతజ్ఞతలు : ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరావతిలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజా ప్రతినిధులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మన కొత్తపేట నియోజక వర్గ సమగ్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించి తక్షణ ఆమోదం తెలిపారు. సమావేశంలో కొత్తపేట నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనులు సామాజిక భవనాలు: కొత్తపేటలో రూ. 5 కోట్ల చొప్పున బీసీ, ఎస్సీ కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు సీఎం లాంఛనప్రాయ అనుమతి.వైద్య సదుపాయం అత్యవసర వైద్య సేవల నిమిత్తం ఆలమూరులో 'ట్రామా కేర్ సెంటర్' ఏర్పాటుకు అంగీకారం. నూతన పాలనా భవనం ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత వేగంగా అందించేందుకు కొత్తపేటలో నూతన తాసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి ఆమోదం. కులాలు, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా పనిచేయాలని సీఎం సూచించారు. అడిగిన వెంటనే మన నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి కొత్తపేట ప్రజల తరపున నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.


# నాదెండ్ల భాస్కరరావు మృతి రాష్ట్రానికి తీరని లోటు : బండారు శ్రీనివాస్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తండ్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మరణ వార్త తీవ్ర విషాదాన్ని కలిగించిందని కొత్తపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కరరావు రాజకీయ రంగంలో అత్యున్నత స్థానాన్ని సంపాదించి, ఎన్టీఆర్, మర్రి చెన్నారెడ్డి, అంజయ్య వంటి ప్రముఖ నాయకులతో కలిసి రాష్ట్ర రాజకీయాలకు కీలక దిశానిర్దేశం చేసిన మహానేత అని ఆయన కొనియాడారు. వారి రాజకీయ ప్రయాణం ఎన్నో సంచలనాత్మక పరిణామాలకు కారణమై, భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. అనేక మంది నాయకులను తీర్చిదిద్దుతూ, రాజకీయ రంగంలో వారికి మార్గదర్శకుడిగా నిలిచిన భాస్కరరావు ఈ రాష్ట్రానికి ఎంతో మంది ప్రతిభావంతులైన నాయకులను అందించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ సందర్భంగా దివంగత నాదెండ్ల భాస్కరరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నామని అన్నారు. తీవ్ర విషాదంలో ఉన్న నాదెండ్ల మనోహర్ కి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం, ఆత్మస్థైర్యం ప్రసాదించాలని కోరుకుంటూ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నాయకులు, నాదెండ్ల భాస్కరరావు పార్థివ దేహానికి హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో వారి స్వగృహం నందు నివాళులు అర్పించడం జరిగింది.మంత్రి నాదెండ్ల మనోహర్ ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేసిన కొత్తపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్.

రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# ఘనంగా అంతర్జాతీయ ఇంగ్లీష్ భాషా దినోత్సవం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ ఇంగ్లీష్ భాషా దినోత్సవాన్ని విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్ భాష, సాహిత్య వైభవాన్ని చాటిచెప్పేలా వివిధ కార్యక్రమాలు చేపట్టారు.

**కార్యక్రమ విశేషాలు:** విద్యార్థులు ఆంగ్ల భాషా ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ముఖ్యంగా విలియం షేక్స్పియర్ రచించిన ప్రసిద్ధ నాటకం 'ది టెంపెస్ట్' లోని ఒక దృశ్యాన్ని విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించగా, 'రోమియో అండ్ జూలియట్' పై ప్రదర్శించిన వీడియో అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థుల మధ్య ఆంగ్ల సాహిత్యంపై జరిగిన పరస్పర చర్చా కార్యక్రమాలు మేధోమథనాన్ని కలిగించాయి.

**వక్తల ప్రసంగాలు:** సభను ఉద్దేశించి ప్రిన్సిపాల్ డా. సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ, "పదాలు ప్రపంచాన్ని కలుపుతాయి" అనే అంశంపై ఆంగ్ల భాషకు ఉన్న గ్లోబల్ ప్రాముఖ్యతను వివరించారు. ఇంగ్లీష్ విభాగాధిపతి డా. ఎన్. లక్ష్మి, అధ్యాపకురాలు షహజాది బేగం మాట్లాడుతూ షేక్స్పియర్ భాషకు ఉన్న చిరస్థాయి గుర్తింపును, సాహిత్య రంగానికి అందించిన శాశ్వత కృషిని కొనియాడారు. ఈ వేడుకలో వైస్ ప్రిన్సిపల్ వై పద్మజ, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని షేక్స్పియర్ కు ఘన నివాళులర్పించారు

రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మిని

# పరామర్శించిన మంత్రి సుభాష్



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఆమెను తాటిపాక గ్రామంలోని స్వగృహానికి వెళ్లి కలుసుకుని, ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ఆమెకు ధైర్యం చెప్పి, త్వరగా పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ప్రజలకు సేవ చేసే నాయకుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఆమె త్వరగా కోలుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ నాయకులు దొంగ శ్రీను, గుబ్బల శ్రీను పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్తపేటలో ఎస్సీ సంఘాల ర్యాలీ

## ఎమ్మెల్సీ పదవి నుంచి అనంతబాబును తక్షణమే తొలగించాలి




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అతన్ని అతని సతీమణిని అరెస్టు చేయాలి డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడైన ఎమ్మెల్సీ అనంత బాబును, అతని సతీమణిని తక్షణమే అరెస్టు చేయాలని, ఎమ్మెల్సీ పదవీ నుంచి అనంత బాబును వెంటనే తొలగించాలని కోరుతూ కొత్తపేటలో ఎస్సీ సంఘాలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కొత్తపేట రామారావు పేట నుంచి ర్యాలీగా బయలుదేరి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడై మూడేళ్ళయినా ఇంకా అతన్ని ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించకపోవడం దారుణమన్నారు. బయట ఉంటే అతడు సాక్షాలను తారుమారు చేయడానికి ప్రయత్నిస్తాడని వెంటనే అతన్ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారంతా కోరారు. ఈ కార్యక్రమంలో పల్లి భీమా రావు, బూసి భాస్కర్ రావు, కముజు శ్రీనివాస్ రావు, సాదే శ్రీనివాస్ నల్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్యానల్స్ ప్రభుత్వ కార్యాలయాలపై ఏర్పాటు చేసి

# ప్రజాధనం ఆదా చేయాలి : పాలూరి సత్యానందం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పిఎం సూర్య ఘర్ యోజన కరంటు గురుంచి టెన్షన్ వద్దు ఇంటిపై సోలార్ పెట్టుకొండి.పాలూరి సత్యానందం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ముఫ్త్ బిజిలీ యోజన పథకం అనేది భారత ప్రభుత్వం ఇళ్లపై రూఫ్ టాప్ ప్లాంట్ ప్రాజెక్ట్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవడానికి ప్రతిష్టాత్మక ఫథకమని ఈపథకం ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు ఉచిత విద్యుత్తును అందించడం సోలార్ శక్తిని ప్రోత్సహించడమని అన్నారు. 300 యూనిట్లు వరకు ఉచితవిద్యుత్తును పొందవచ్చు సబ్సిడీ కూడా లభిస్తుందన్నారు.కూటమి ప్రభుత్వంలో విద్యుత్తు పంపిణీ వ్యవస్థద్వారా కాని,మున్సిపల్,,సచివాలయ అధికారులను కలిసి సోలార్ పథకం పొందవచ్చని అన్నారు. విద్యుత్తు బిల్లులు తగ్గుతాయని, పర్యావరణానికి మేలు చేకూరుతుందని, దీనిద్వారా డబ్బుకూడా సంపాదించవచ్చని అన్నారు.ఏప్రిల్‌లోనే ఎండలు విపరీతంగా ఉన్నాయని కరంటు ఎప్పుడు పోతుందో తెలియడంలేదని దానివల్ల ప్రజలు ఉక్కపోత బరాయించలేక పోతున్నారని అధికారులు విద్యుత్తు పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పాలూరి తెలియజేశారు.

ఇంటర్ పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన

# వర్షిని, వర్ధినిలను అభినందించిన మంత్రి సుభాష్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంటర్ పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన కొత్తపేట సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి కుమార్తెలు వర్షిని, వర్ధినిలను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అభినందించారు. కొత్తపేటలోని గుబ్బల మూర్తి స్వగ్రాహానికి విచ్చేసిన మంత్రి సుభాష్ చదువులలో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇక్కడ రావడం జరిగిందని ఆయన తెలియజేశారు. వర్షిని, వర్ధినిలను శాలువా కప్పి మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే వయసులో పూర్తిగా విద్యపై దృష్టి సారించాలని రేపు వారి భవిష్యత్తును విద్యే నిర్దేశిస్తుందని ఆయన అన్నారు.నేటి సమాజంలో చెడు అలవాట్లకు లోను కాకుండా తల్లిదండ్రులు పిల్లలను అనుక్షణం గమనిస్తూ ఉండాలని పూర్తిగా చదువుపై శ్రద్ధ వహించేలా చూడవలసిన బాధ్యత నెలకొని ఉందని సున్నితంగా హెచ్చరించారు. సామాజిక వర్గంలో చదువుల్లో రాణిస్తున్న విద్యార్థులను స్కాలర్షిప్ ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు. చెముడు లంకలోని షిరిడి సాయి విద్యానికేతన్ చదువుతున్న వర్షిని వర్ధినిలకు ఇంటర్ సెకండియర్ పరీక్షా ఫలితాలలో 988/ 929 మార్కులు సాధించినట్లు గుబ్బల మూర్తి తెలిపారు. మంత్రి సుభాష్ తోపాటు దొంగ శ్రీను కొత్తపేట టిడిపి నాయకులు ముత్యాల బాబ్జి కంఠంశెట్టి శ్రీనివాస్ తులా రాజు కడలి బీమా బొక్క ప్రసాద్ గుబ్బల సుబ్రహ్మణ్యం మట్ట బాలు శీలం సూర్య చంద్రరావు ముసిని వెంకటరమణ చిట్టూరి బాలకృష్ణ సంగినీడి శ్రీను పోలిశెట్టి శ్రీను ఎర్రం శెట్టి మురళి గుబ్బల సాయి తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం శ్రీ చైతన్య స్కూల్లో

# ఘనంగా ముగిసిన ఫ్యామిలీ ఫెస్ట్‌లు

## సెలవుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు ఇచ్చిన ఆర్ఐ నరేష్




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం శ్రీ చైతన్య స్కూల్లో న్యూ అడాప్షన్ ప్రోగ్రాంలో భాగంగా గత వారం రోజులుగా ఫ్యామిలీ ఫెస్ట్ కార్యక్రమలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ జగదీష్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రీజనల్ ఇంచార్జ్ ఎంవిఎల్ నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులు క్రమశిక్షణగా తల్లిదండ్రులు పట్ల గురువుల పట్ల గౌరవం కలిగి ఉండి ఉన్నత పౌరులుగా ఉండాలని ఉన్నత విలువలతో సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులు చదువుల్లో రాణించాలని తెలియజేశారు. అలాగే వేసవి సెలవుల్లో విద్యార్థులు ఏ విధంగా ఉండాలి అనే సూచనలు సలహాలు చేశారు. సమయాన్ని వృధా చేయకుండా ఆటపాటలతో పాటు వ్యాయామాలు యోగా మెడిటేషన్ లాంటి వాటితో పాటు కంప్యూటర్ స్కిల్స్ పైన ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నాము ఆ సబ్జెక్టుల్లో పట్టు సాధించే విధంగా మెలుకవులు నేర్చుకోవాలని, ఏదైనా డౌట్స్ ఉన్నా ఆయా సంబంధిత టీచర్లు ఫోన్లో అందుబాటు ఉంటారని పేర్కొన్నారు. ముఖ్యంగా బాయ్స్ గోదావరి కాలువల కు దూరంగా ఉండాలని అధిక వేడిమి ఎండల వల్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు చెబుతూ చిన్నతనం నుంచే ఇంటి పని లో తగు తర్ఫీదు నివ్వాలని, వారు సూచించారు. ఈ కార్యక్రమల్లో సభకు హాజరైన తల్లిదండ్రులను గౌరవంతో విద్యార్థులు పాదపూజ చేసి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఇంచార్జ్ ప్రైమరీ మరియు ప్రీ ప్రైమరీ ఇన్చార్జిలతో మరియు ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# మాదకద్రవ్యాల నిర్మూలనపై భారీ అవగాహన సదస్సు




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈరోజు ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్. రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, మత్తు పదార్థాల వల్ల యువత ఎదుర్కొంటున్న సవాళ్లు వాటి పర్యవసానాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామచంద్రపురం పట్టణ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నేటి యువతే దేశానికి వెన్నెముక అని, అటువంటి యువశక్తి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల బారిన పడి నిర్వీర్యం కావడం ఆందోళనకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వాడకం వల్ల శారీరక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, మానసిక స్థితి వికటించి నేర ప్రవృత్తి వైపు మళ్లే ప్రమాదం ఉందని విద్యార్థులను హెచ్చరించారు. అంతేకాకుండా, మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం చేస్తూ పట్టుబడితే ఎదురయ్యే కఠినమైన చట్టపరమైన శిక్షలను, ఎన్.డి.పి.ఎస్ చట్టం ద్వారా కలిగే పరిణామాలను వివరించారు. ఒక్కసారి నేర చరిత్ర నమోదైతే అది విద్యార్థుల భవిష్యత్తును, కెరీర్‌ను పూర్తిగా దెబ్బతీస్తుందని గుర్తు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కన్వీనర్ కె. రవిబాబు, కె. తిమోతి మరియు వైస్ ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొని, విద్యార్థులు తమ చుట్టుపక్కల ఎవరైనా డ్రగ్స్ కు అలవాటు పడితే వారిని సరైన మార్గంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని, మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు.

# మండల స్థాయి అధికారులతో ఎంపీడిఓ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజనీకానికి వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకంపై అవగాహన, కిచెన్ గార్డెన్ ఏర్పాటు ఉపయోగం, ప్లాస్టిక్ నిషేధం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ తదితర అంశాలపై మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఇంజనీర్ అసిస్టెంట్‌లతో ఎంపీడీఓ బి.రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించే విధంగా ప్రజానీకానికి అవగాహన కల్పించాలని సూచించారు.ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల్లో ఘణ వ్యర్థ పదార్థాల నిర్వాహణ సక్రమంగా జరిగే విధంగా క్షేత్ర స్థాయి సిబ్బంది పూర్తి బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు విరివిగా నిర్వహించి ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీఠ వేయాలని ఆకాంక్షించారు. సదరు శిక్షణలో డిప్యూటీ ఎంపీడీఓ సూర్య నారాయణ రాజు,శిక్షణకు మాస్టర్ ట్రైనీ కాట్రేనికోన పంచాయతీ కార్యదర్శి జె వి సత్యన్నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీర్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

శ్రీ కోదండ రామాలయం పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో

# పాల్గొన్న టిడిపి ఇన్చార్జ్ గొల్లపల్లి అమూల్య



**మలికిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మలికిపురం. మండలం గూడపల్లి మెయిన్, యాదవుల గ్రూపు నందు చేపట్టబోతున్న శ్రీ కోదండ రామాలయం పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య పాల్గొని వేద పండితులతో కలిసి పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్మిస్తున్న శ్రీ కోదండ రామ స్వామి వారి ఆలయం త్వరితగతిన నిర్మాణం జరిగి అతి త్వరలోనే విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరగాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో అమూల్య గారితో పాటుగా ముదునూరి చినబాబు రాజు అడబాల సాయిబాబా పున్నం గంగారావు కటికిరెడ్డి సత్యనారాయణ, కటికిరెడ్డి గోపాలకృష్ణ, సుందర బ్రహ్మయ్య, సుందర కొండబాబు, డిప్యూటీ తాసిల్దార్ సోమాని శ్రీనివాస్ కొణిదెల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ సూరిమేను వీర పద్మజ, మందపాటి వెంకటేశ్వర్లు, సూరిమేను రాంబాబు, కైలా త్రిమూర్తులు, మందపాటి శ్రీనివాస్, గుండుమేను నాగేశ్వరరావు, సూరిమేను బుల్లి వీరన్న మరియు శ్రీ కోదండ రామాలయం యూత్ కమిటీ వారు, ఆలయ స్థల దాతల కుక్కల సత్యనారాయణ దంపతులు ఇతర పెద్దలు యాదవ్ కమ్యూనిటీ పెద్దలు మరియు అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, పోటీలు

## విద్యా బాల మందిర్ విద్యార్థులకు మెడల్స్




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** జనాభా లెక్కలు -2026 భాగంగా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులు మేరకు జనాభా లెక్కలు అనే అంశంపై పాఠశాలలో ఆరోవ తరగతి నుండి ఎనిమిదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ సాధించిన వారికి మండల విద్యాశాఖాధికారి వారు ఇచ్చిన మెడల్స్ ను పాఠశాల కరస్పాండెంట్ రామోజు అనురాధ చేతుల మీదుగా అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రదాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం ఉపాధ్యాయులు సుధాకర్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారిన

# అభివృద్ధి శూన్యం అనడానికి నిదర్శనం



## సిరిపురం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణం




**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామంలో సుమారు 30 సంవత్సరాలపైబడి కొనసాగుతున్న స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ నందు కనీస వసతులకి సైతం నోచుకోక పోవడం విద్యార్థిని విద్యార్థులకి సైతం అంతుచిక్కని సమస్యగా మారింది. వివరాల్లోకి వెళితే స్థానిక హై స్కూల్ నందు గ్రామంలో విద్యార్థిని విద్యార్థులే కాకుండాచుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 400కు పైబడి స్కూల్ నందు చదువుతున్నారు. గ్రామంలో డంపింగ్ యార్డ్ లేక స్కూలు ఆవరణ చుట్టూ కుప్పలు తెప్పలుగా చెత్తను వేయడం వల్ల విద్యార్థినీ విద్యార్థుల అనారోగ్యానికి శాపంగా మారుతుంది. ప్రధానంగా విద్యార్థినులకు బాత్రూం వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల, అర కోర ఉన్నప్పటికీ శుభ్రత లోపించడం వల్ల విద్యార్థినీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. టైంకి వచ్చామా పాఠాలు చెప్పామాజీతాలు తీసుకున్నామా టైంకి వెళ్ళిపోయామా.. అన్నట్లు స్కూల్ వాతావరణాన్ని పట్టించుకోని ఉపాధ్యాయుల వైఖరి ఒకవైపు ఎన్నిసార్లు కంప్లైంట్ ఇచ్చిన సరే పట్టించుకోని అధికారుల వైఖరి మరోవైపు ప్రభుత్వం విద్యార్థినీ విద్యార్థులకు అందించే నాటి అమ్మఒడి నుంచి నేటి తల్లికి వందనం వరకు ఇచ్చే 15 వేలుకి 2 వేలు ప్రత్యేకించి స్కూల్లో మరమ్మత్తుల కోసంఅని స్కూల్ శుభ్రత కోసం అని తీసుకుంటున్న డబ్బులు ఏమైపోతున్నట్టు. స్కూలు ఆవరణలో పెట్టిన సిసి కెమెరాలు ఏమయ్యాయి. అసలు విద్యార్థిని విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించని స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు. గ్రామంలో ఉన్న చెత్తని అంత తీసుకొచ్చి స్కూల్ఆవరణలో వేయడం పట్ల పంచాయతీ అధికారుల పనితీరు కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది.

# అనతి కాలంలోనే అద్భుత విజయాలు సాధించడం "విజ్ఞాన్" గొప్పతనం

### ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులతో విద్యార్థుల విజయం : విజ్ఞాన్ అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ అమ్మిరెడ్డి



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** యువత సమాజంలో జరిగే చెడును అర్థం చేసుకొని దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలపై దృష్టి నిలపడం నేర్చుకోవాలని రాయవరం ఎస్సై సురేష్ బాబు వివరించారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రమైన రాయవరం లో గల విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు 1000 మార్కులకు గాను సుందర హరి శ్రీలక్ష్మి 990, మేడపాటి లక్ష్మీ గణ పూజిత 989 మార్కులు సాధించి రాష్ట్రంలోనే ఐదు, ఆరు ర్యాంకులతో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సందర్భంగా విజ్ఞాన్ విద్యాసంస్థల అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాయవరం ఎస్సై సురేష్ బాబు, తెదేపా సీనియర్ నాయకులు ఉండవల్లి రాంబాబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలుత డాక్టర్ అమ్మి రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విలువలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో 60 మంది విద్యార్థులతో 2022లో స్థాపించి ప్రారంభించగా ఆనతి కాలంలోనే ఉత్తమ ఫలితాలతో విజ్ఞాన్ విద్యాసంస్థలు తల్లిదండ్రుల నమ్మకాలతో పాటు, రాష్ట్రంలోనే ఉత్తమ ర్యాంకులను సంపాదించడం గర్వకారణమన్నారు. ఇంటర్ డిగ్రీల విద్యలతో పాటు ఉద్యోగం నైపుణ్యాలు పెంపొందించడం అందించే కోర్సులు ఫలితంగా గత సంవత్సరం రైల్వేలో పలువురు విద్యార్థులు ఉద్యోగాల సాధించడం సంతోషం కలిగించిందన్నారు. తదుపరి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై సురేష్ బాబు మాట్లాడుతూ సమాజ పోకడ ప్రభావంతో చెడు వైపు దృష్టిపడినా, తిరిగి నిలదొక్కుకునే సామర్థ్యం సంపాదించాలని క్రమశిక్షణ, స్నేహితుల ఎన్నిక, కష్టపడే తత్వం ఉన్న లక్ష్యాలు చేరుకోవడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని ముఖ్యంగా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి అంటే నేర్చుకోవాలనే తపన అవసరమని వివరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థినులకు చిరు సత్కారాలను నిర్వహించారు. అనంతరం విజ్ఞాన్ విద్యాసంస్థల యాజమాన్య కమిటీ సభ్యులు సమావేశానికి హాజరైన విలేకరులందరినీ దుస్సాలువా సన్మానించారు. విజ్ఞాన్ ప్రగతికి మీడియా సహకారం మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థలు సెక్రటరీ,కరెస్పాండెంట్ డాక్టర్ మల్లిడి శేష వేణి, విజ్ఞాన్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్ అచ్చిరెడ్డి, విఎస్ఆర్ రూలర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ మల్లిడి సతీష్ రెడ్డి, విజ్ఞాన్ సిఆర్టి ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి సుబ్బిరెడ్డి, విజ్ఞాన్ జూనియర్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ సబ్బెళ్ళ శ్రీ సాయి విక్రమ్ రెడ్డి, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.త్రివేణి విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ రద్దు చేయాలి


### ధవళేశ్వరం గ్రామంలో తలారి మూర్తి ఆధ్వర్యంలో దళిత సంఘాల సమావేశం



**ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నియోజకవర్గానికి చెందిన దళిత సంఘాలు, అంబేద్కర్ వాదులు కలిసి ధవళేశ్వరం గ్రామంలో రూరల్ నియోజకవర్గ నాయకులు తలారి మూర్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ, దళితులపై జరుగుతున్న దాడులు, న్యాయ పరిరక్షణ, సామాజిక భద్రత వంటి అంశాలపై తీవ్ర చర్చ జరిగింది. పలు దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలో దళితులపై దాడులు, హత్యలు వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. అప్పుడు నిందితులు సులభంగా బెయిల్‌పై బయట తిరుగుతూ బాధితులను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. దాంతో దళితులు అవమానకర పరిస్థితుల్లో జీవించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు తమ రాజ్యాంగబద్ధ హక్కులను వినియోగించి రాజకీయ మార్పును తీసుకువచ్చారని, అన్యాయానికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలిచారని నాయకులు పేర్కొన్నారు. అయినప్పటికీ ఇప్పటికీ కొంతమంది ప్రభావశీలులు తమ ప్రభావాన్ని ఉపయోగించి దళితులపై ఒత్తిడి కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన ఒక దళిత యువకుడి హత్య కేసును ప్రస్తావిస్తూ, ఆ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రజాప్రతినిధి అనంత బాబు బెయిల్‌పై బయట ఉండి సాక్షులను బెదిరిస్తున్నారని, డబ్బులతో ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నారని సమావేశంలో ఆరోపించారు. ఈ పరిణామాలు న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వం, పోలీసు శాఖను ఉద్దేశించి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసును వేగంగా విచారించి నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బెయిల్‌పై ఉన్న నిందితుల కార్యకలాపాలను పర్యవేక్షించాలని కూడా కోరారు. దళితుల ఆత్మగౌరవం, రాజ్యాంగబద్ధ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంటూ, తగిన చర్యలు తీసుకోకపోతే చట్టబద్ధ మార్గాల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గానికి నాయకులు జల్లి కృపారావు, రొంపిచర్ల ఆంటోని, మద్దా మణి, కాయల సత్యనారాయణ, గాలి వెంకటేశ్వరరావు, దళిత సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, కుసుమ సాయి బాబా, నాయన సూర్యారావు, ఈతకోట రాజ్ కుమార్, కొడమంచిలి సూర్య, ముచ్చి సురేష్, శీలం రవి, ఇప్పర్తి శీను, ముమ్మిడివరపు మహాలక్ష్మి, పీతల ముత్యాలరావు తదితరులు హాజరయ్యారు. సమావేశం చివరలో దళితుల ఐక్యతే తమ బలం అని, న్యాయం కోసం చట్టబద్ధంగా పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారిగా

# విజయరాజు బాధ్యతలు స్వీకరణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా డ్వామాలో జిల్లా విజిలెన్స్ అధికారిగా ఆర్.విజయరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ కీర్తి చేకూరిని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ విజిలెన్స్ అధికారి బాధ్యతలు ఎంతో కీలకమని, విధి నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకతతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో పర్యవేక్షణ పాత్ర ముఖ్యమని, నిబద్ధతతో పనిచేయాలని పేర్కొన్నారు.ఆర్. విజయరాజు గతంలో ఏలూరు జిల్లాలో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, పనిచేసి, బదిలీపై డీడీఓ క్యాడర్‌లో జిల్లా విజిలెన్స్ అధికారిగా ఈస్ట్ గోదావరి జిల్లాకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎమ్ నాగ మహేశ్వర రావు, ఇతర సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

ఇష్టానుసారంగా

# భారీ వాహనాల రాకపోకలు

### ఆదమరిస్తే ద్విచక్ర వాహన చోదకులకు గాయాలే మిగులు
### అధికారుల నిర్లక్ష్యంతో నిబంధనలు తుంగలోకి



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట టౌన్‌లో ఇష్టానుసారంగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి బైపాస్ నుండి వెళ్ళాలి అనే విషయమే వీళ్ళు మరిచిపోయేలా చేసిన అధికారుల నిర్లక్ష్యం.అసలే మండపేట రోడ్ల దుస్థితి చూస్తే ఇరుకు రోడ్లతో సందులు మాదిరిగా దర్శనమిస్తాయి. ఇక ట్రాఫిక్ గురించి చెప్పనే అక్కర్లేదు అలాంటి ఇరుకు రోడ్లలో భారీ వాహనాలు యాదేచ్చగా తిరుగుతు ట్రాఫిక్ తో నిరంతరం పోరాడే ప్రజలకు మరింత తలపోటు తెస్తున్నారు. వీరు మమ్మల్ని ఎవరు అడుగుతారులే అని నిబంధనలు ప్రకారం వేయాల్సిన టన్నేజీ కన్న రెండింతాలు అధికంగా రవాణా చేస్తున్నారు. వీళ్లు వ్యవహరిస్తున్న తీరుపై పోలీస్, రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనుమరుగయ్యాయి. ఇక ఇసుక లారీలు విషయానికి వస్తే ఎటువంటి భద్రత ప్రమాణాలు పాటించకుండా మాకు నాయకుల అండ దండాలు ఉన్నాయి లే అన్నట్టు వ్యవహారలిస్తున్నారు. ఈ ఇసుక లారీల వెనుక వెళ్లిన వారి పరిస్థితి చుస్తే లారీ లో ఉన్న ఇసుక అంత వారి మీదే ఉంటుంది.పోలీస్ వారు ఇప్పటికైనా మేల్కొని భారీ వాహనాలను బైపాస్ గుండా వెళ్లేట్టు చర్యలు తీసుకుని ట్రాఫిక్ ను క్రమబద్ధికరిస్తే బాగుంటుంది అని ప్రజలు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు.ఇకా రాత్రులు అయితే చాలు మండపేట బైపాస్ రోడ్డు మీదగా వెళ్లవలసిన హైదరాబాద్ వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు మెయిన్ రోడ్ లో ప్రవేశిస్తూ ప్రజలకు తీవ్రమైన అసౌకర్యాన్ని కలిగిస్తూ ట్రాఫిక్ ఇక్కట్లను సృష్టిస్తున్నారని కనీసం పట్టించుకునే అధికారులే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు టౌన్ పరిధిలో ప్రవేశించి బస్సులకు ఉండవలసిన లైటింగ్ కంటే అధిక ఫోకస్ లైటింగ్ లు అమర్చి ప్రజల కంటి చూపును దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాయని ఇప్పటికైనా ఈ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల పై అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకుని టౌన్‌లో ట్రాఫిక్‌ను నియంత్రణలో పెడితే బాగుంటుందని ప్రజలు సంబంధిత శాఖ అధికారులను కోరుతున్నారు.

# దళితులపై కపట ప్రేమ చూపిస్తున్న వైసిపి

### ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అండదండలతో దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం దారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును తక్షణమే అరెస్ట్ చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట నియోజకవర్గం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండపేట ప్రకాశం స్కూల్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ కూటమి నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దళితులు తమ సొంత సోదరులని వారికి ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటామని మొసలి కన్నీరు కార్చే వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఈ విషయంలో నోరు ఎందుకు విప్పడం లేదని ప్రశ్నించారు. దళితులకు అన్యాయం చేస్తూ వారిని పొట్టన పెట్టుకున్న అనంతబాబు దంపతులను ఎందుకు వెనుక వేసుకున్నారని నిలదీశారు. వైసీపీ నాయకుడు అనంతబాబును వెంటనే అరెస్టు చేయాలంటూ చేపట్టిన నిరసన హోరెత్తింది. తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య ఉదంతంలో అనంతబాబు ప్రమేయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయం జరగాలంటే ప్రధాన నిందితుడు జైలులో ఉండాల్సిందేనని వేగుళ్ళ జోగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్ర శేఖర్, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ,శిరంగు ఈశ్వరరావు,టౌన్ టిడిపి ప్రెసిడెంట్ మచ్చా నాగు, బిజెపి నాయకులు కోన సత్యనారాయణ, మద్దాల సుబ్బారావు, జన సేన టౌన్ అధ్యక్షులు నామాల చంద్రరావు, టిడిపి నాయకులు ఉంగరాల రాంబాబు, కుక్కల రామారావు, 7 వ వార్డు టిడిపి ఇన్ ఛార్జ్ చాపల వీరబాబు, పెందుర్తి కిషోర్, పెందుర్తి ప్రదీప్, కొవ్వాడ అప్పన్న బాబు, పిట్టా రాజబాబు, బదుగు రత్నరాజు, జొన్నపల్లి సూర్యారావు, వాద ప్రసాద్,జొన్నపల్లి శివ, చిట్టూరి సతీష్, వేమగిరి మోషే, ముమ్మిడివరపు ఆదినారాయణ, మోరంపూడి సుబ్రహ్మణ్యం, ధూళి ప్రవీణ్, మచ్చా రాంబాబు, సాధనాల చక్రపాణి, జక్కల నరేంద్ర, రావడి నాని, గుండు తాతరాజు, గడి రాంబాబు,ఎగ్గడా లోవరాజు, బొట్టా వీర్రాజు,సబ్బిట్ట అనిల్,వేమవరపు రమణ, కాటే విజయ్ కుమార్, కొల్లటి ప్రసాద్, బండి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మెగాఉద్యోగ మేళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏలేశ్వరం వారి ఆధ్వర్యంలో "మెగా జాబ్ మేళాను ఈ నెల 25-04-2026 (శనివారం) ఉదయం 9.00 గంటలకు కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. సునీత తెలిపారు. ఈ జాబ్ మేళాను ఏపీఎస్ఎస్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ స్కిల్ ఏపీ) మరియు వికాసాకాకినాడ)సహకారంతో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా ప్రత్తిపాడు నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజ హాజరుకానున్నారని ఈ మెగా జాబ్ మేళాలో ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, డిప్లొమా మరియు డిగ్రీ పూర్తి చేసి 35 సంవత్సరాల వయస్సు లోపు అభ్యర్థులు పాల్గొనవచ్చునని, అభ్యర్థులకు ప్రత్యక్ష ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ 10,000 నుండి రూ. 23,000 వరకు జీతం , ఇంటెన్సివ్ మరియు రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాల బట్టి ఉంటుందని, జాబ్ మేళా లో పాల్గొనే కంపెనీలు ఐసాన్‌ఎక్స్‌పీరియెన్సెస్ ,చోళమండలం గోల్డ్ లోన్, యాక్సిస్ బ్యాంక్ , డెక్కన్ కెమికల్స్, టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్, సుందరం ఫాస్టెనర్స్ లిమిటెడ్, అపోలో టైర్స్ లిమిటెడ్, ఇసుజు మోటార్స్ లిమిటెడ్, ఇండోమిమ్, అపోలో ఫార్మసీ, బ్యాంక్ ఆఫ్ బరోడా కార్డ్స్, ఎస్‌బీఐ పేమెంట్స్ , ఎస్‌బాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెమిటెడ్,పంజాబ్ నేషనల్ బ్యాంక్ కార్డ్స్ ,హ్యుందాయ్ మొబిస్ మరియు సన్‌వింకో సోలార్ ఎనర్జీ లు అభ్యర్థులకు ఎంపిక చేసుకుంటాయని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, అర్హత ధృవ పత్రాలతో నేరుగా ఫార్మల్ డ్రస్ కోడ్‌లో హాజరుకావాలని సూచించారు. ఈ జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు విస్తృతంగా లభించనున్నాయని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్‌శ్రీ కోరారు.

# మర్రివీడు గ్రామంలో పర్యటించిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

### గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీపీ, జ్యోతుల పెదబాబు
### పరిమితడక గ్రామంలో ఉపాధి కార్మికులకు సీతా ఈశ్వరి ట్రస్ట్ ద్వారా మజ్జిగ పంపిణీ



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం మర్రివీడు గ్రామపంచాయతీ పరిధిలో ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు పర్యటించారు. పరిమితడక గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేపడుతున్న ఉపాధి కార్మికులకు సీత ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ చైర్మన్ ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి లో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి శ్రామికులతో మాట్లాడుతూ ఈ మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. అనంతరం గ్రామంలో గత ప్రభుత్వంలో ప్రారంభమై నిర్మాణానికి నోచుకోని సచివాలయం వెల్నెస్ సెంటర్ ను స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచనలతో తిరిగి నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచనలతో మర్రివీడు గ్రామంలో నిర్మాణ దశలో ఆగిన సచివాలయం, వెల్నెస్ సెంటర్ నిర్మాణం పనులకు ఎంపీపీ బుజ్జి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు కొబ్బరికాయ కొట్టి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి కార్మికుల ఉపసమనానికి మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు ఆయన తెలిపారు.గత ప్రభుత్వంలో నిర్మాణానికి నోచుకోని సచివాలయం వెల్నెస్ సెంటర్ పనులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచనలతో ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామరాజు వర్మ, ఏపీఓ సురేష్ బాబు, కూటమి నాయకులు నాయకులు ఊలపల్లి శ్రీకాంత్, బుజ్జి రాజు, నీలి సత్యనారాయణ, సిరిపురపు శ్రీను, ఉపాధి హామీ సిబ్బంది,ప్రజా ప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# స్వీయ జనగణనపై అవగాహన కార్యక్రమం

### నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలి : ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీత



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏలేశ్వరం నందు జనాభా గణనను డిపార్ట్మెంట్ ఒఫ్ పోలిటికల్ సైన్స్ మరియు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత అధ్యక్షతన అవగాహన కార్యక్రమ్యాన్ని నిర్వహించారు. తరువాత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత మాట్లాడుతూ జనగన ప్రతి పది సంవత్సరాలకు ఒక సారి జరుగుతుందని దీని వల్ల దేశ జనాభా, పురుషులు, మహిళలు, చిన్న పిల్లలు ఇలా చాలా విషయాలు డేటా ఏర్పాటుచేయడం జరుగుతుందని కాబట్టి అందరూ స్వీయ జనగణనలో పాల్గొని జనగణన నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి ఏలేశ్వరం తహశీల్దార్ కె. కుశరాజు ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడుతూ సెల్ఫ్-ఎన్యూమరేషన్ అంటే జనాభా గణనలో మన వివరాలను మనమే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం. అని అధికారిక పోర్టల్ ద్వారా 2027 జనగణన కోసం ఏప్రిల్ 16, 2026 నుండి ఈ సదుపాయం ప్రారంభమైందని . మొబైల్ నంబర్, ఆధార్ కార్డుతో లాగిన్ అయి కుటుంబ, వ్యక్తిగత వివరాలను నమోదు చేసి, రిఫరెన్స్ నంబర్‌ను సేవ్ చేసుకోవాలని . పేరు, వయస్సు, విద్య, ఉద్యోగం, వివాహ స్థితి, భాష, మతం, ఇంటి అడ్రస్, సభ్యుల సంఖ్య, హౌసింగ్ వివరాలు నమోదు చేసి సబ్మిషన్ చేయాలని తరువాత వచ్చే రిఫరెన్స్ ఐడిని భద్రపరుచుకోవాలని తెలియజేశారు. ఈ ప్రక్రియ తప్పులు లేకుండా, సురక్షితమైన ఇంటర్నెట్ నెట్‌వర్క్‌లో చేయాలని .సెల్ఫ్-ఎన్యూమరేషన్ పూర్తి చేసిన వారికి కూడా ఎన్యుమరేటర్ (గణకుడు) ఇంటికి వచ్చినప్పుడు ఈ నంబర్ చూపించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమమలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ప్రయాగ మూర్తి ప్రగడ, వైస్ ప్రిన్సిపాల్ కె. వేంకటేశ్వర రావు, అధ్యాపకులు వి రామ రావు, కె.సురేశ్. శివప్రసాద్. వీరభద్ర రావు, ఎస్కే మదీనా, శ్రీ లక్ష్మి , కె.బంగారాజు, మేరి రొసిలిన పుష్పా, సతీశ్ మరియు అద్యపకేత సిబ్బంది పెద్ద సంఖ్యలో విద్యార్దులు పాల్గొన్నారు.

# శంఖవరం మండల జన గణకులకు త్రిదిన శిక్షణ పూర్తి

### 57,017 మంది జనాభాకు 117 మంది గణకులు
### 39 మంది చొప్పున మూడు బ్యాచులకు మూడు రోజుల శిక్షణ పూర్తి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండల జన గణన కోసం నిర్దేశించిన గణకులకు గణన విధాన ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కోసం వరుసగా మూడు రోజుల పాటు ఇచ్చిన శిక్షణ గురువారంతో పూర్తైంది. శంఖవరం మండలంలోని 14 పంచాయతీల పరిధిలో 2011 భారత జనగణన గణాంకాల ప్రకారం మొత్తం జనాభా 57,017 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 28,575 మంది కాగా స్త్రీలు 28,442 మంది ఉన్నారు. 2011 తర్వాత 11 సంవత్సరాల ప్రస్తుతం జరుగుతున్న భారత జన గణనకు శంఖవరం మండలాన్ని 105 బ్లాకులుగా విభజించారు. ఈ బ్లాకుల్లో జనాభా లెక్కింపునకు 91 మంది గణకులు, మరో 8 మంది రిజర్వ్ గణకులను, 16 మంది పర్యవేక్షకులు, ఇద్దరు రిజర్వు పర్యవేక్షకులను నియమించారు. గణాంకాధికారులు, పర్యవేక్షకులుగా సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులను సర్వే కి నియమించారు. మొత్తం ఈ 115 మంది సిబ్బందికి అదనంగా మరో ఇద్దరు అధికారులను కలుపుకుని మొత్తం 117 మందినీ ఒక్కొక్క సమూహానికి 39 మంది చొప్పున మూడు సమూహాలుగా విభజించారు. వీటిలో ఒక్కొక్క సమూహానికి ఒక్కో రోజు చొప్పున మూడు రోజుల పాటు మండల కేంద్రం శంఖవరంలోని సచివాలయం 1 లో డిగ్రీ కాలేజ్ లెక్చరర్ రామన్న, శంఖవరం మండల ప్రజా పరిషత్తు ప్రాథమిక పాఠశాల (మెయిన్) ప్రధాన ఉపాధ్యాయులు కుర్రే వెంకటేశ్వరావు శిక్షణ ఇచ్చారు. ఈ జనాభా గణన మొత్తం కార్యక్రమానికి చార్జ్ ఆఫీసరుగా తాహసిల్దారు అల్లాడి తాతారావు వ్యవహరిస్తుండగా, సాంకేతిక సహాయకులుగా మండల సహాయ గణాంకాధికారి (ఎం.ఎస్.ఓ) పెనుగొండ మురళీ బ్రహ్మ ప్రసాద్ భాధ్యత వహిస్తున్నారు. ఈ మూడు రోజుల శిక్షణలో శిక్షకులు, శిక్షణార్థులతో పాటు మండల ఉప తాహసిల్దార్ ఎస్.కిరణ్ కూమార్ కూడా పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తణుకువాడ పిఏసిఎస్ చైర్మెన్ పితాని సతీష్ కుమార్ అన్నారు. తణుకువాడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సతీష్ కుమార్ ప్రారంబించి రైతులకు బిల్లులు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రైతుసేవాకేంద్రం ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే రైతులు దాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో కనీస మద్దత్తు ధర 75 కేజీలు బస్తాకు ప్రభుత్వం రూ 1777 చెల్లిస్తుందన్నారు. భయట మార్కెట్లో తక్కువ ధర చెల్లిస్తున్నారని రైతులు ధకారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈఓ వై.వెంకటసుబ్బారావు (శ్రీసు), కార్యదర్శి పుల్లేపు పెద్దకాపు పలువురు రైతులు పాల్గొన్నారు.



# ఇరవై ఏళ్ల సమస్యలకు పరిష్కారం

## అన్నపూర్ణమ్మపేటలో అభివృద్ధి వేగం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 6వ డివిజన్ అన్నపూర్ణమ్మపేట రైల్వే గేట్ పరిసర ప్రాంతంలో గత 20 సంవత్సరాలుగా కొనసాగుతున్న రోడ్లు, డ్రైనేజ్ సమస్యలకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ పరిణామంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా దయనీయ స్థితిలో ఉన్న రహదారులు, డ్రైనేజ్ సమస్యలు పలు ప్రభుత్వాలు మారినా పరిష్కారం కాలేదని స్థానికులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తించి తాము చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. అన్నపూర్ణమ్మపేట రైల్వే గేట్ వద్ద రూ.20 లక్షలతో సీసీ డ్రైనేజ్ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు, డివిజన్ ఇన్‌చార్జ్ మజ్జి మణికంఠలతో కలిసి శంకుస్థాపన చేశారు. 2014-19 మధ్య ప్రతిపాదనలు వచ్చినప్పటికీ పనులు ముందుకు సాగలేదని, అనంతరం వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అన్నపూర్ణమ్మపేట రైల్వే గేట్ నుంచి బైపాస్ రోడ్డువరకు, తాడితోట వరకు రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు డ్రైనేజ్ సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు రూ.20 లక్షలతో డ్రైనేజ్ పనులు, రూ.40 లక్షలతో రహదారి నిర్మాణం, మరో రూ.45 లక్షలతో ఇతర అభివృద్ధి పనులు చేపట్టి మొత్తం రూ.1.20 కోట్ల పనులు పూర్తి చేసినట్లు వివరించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా రైల్వే బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని యత్నించిందని, ఇళ్లకు, దేవాలయాలకు గుర్తులు పెట్టడం జరిగింది అని ఆరోపించారు. అయితే స్థానికుల ఆందోళనలకు మద్దతుగా నిలబడి "ప్రజలు కోరిందే చేస్తాం" అనే హామీ ఇచ్చామని, అదే హామీని ఇప్పుడు అమలు చేస్తున్నామని అన్నారు. ప్రత్యామ్నాయంగా అన్నపూర్ణమ్మపేట గేట్ నుంచి సంహిత డిగ్రీ కాలేజ్ వరకు ఇరువైపులా రహదారులను అభివృద్ధి చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించామని తెలిపారు. ఇంకా రూ.2.30 కోట్లతో మిగిలిన పనులు పూర్తయితే ఈ వార్డులో రోడ్లు, డ్రైనేజ్ సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయని చెప్పారు. ప్రజల అభిప్రాయానికే ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ప్రభుత్వ లక్ష్యమని, స్థానికుల సహకారంతో మరిన్ని పనులు కొనసాగిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, దొండపాటి సత్యంబాబు, నక్కా చిట్టిబాబు, కాశీ నవీన్ కుమార్, మహ్మద్ అబ్దుల్లా, బుడ్డిగ రవి, దాస్యం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి కళ్యాణాన్ని

# తిలకించి పులకించిన భక్తజనం

- భారీ అన్న సమారాధన



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని దోసకాయలపల్లిలో గురువారం ఉదయం శ్రీ పర్వత మర్దిని సమేత ఉమా రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు అశేష భక్తుల శివనామ స్మరణతో నింగినట్టాయి. గురువారం ఈ విగ్రహప్రతిష్ట మహోత్సవాలలో భాగంగా భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ పర్వత మర్దిని సమీత ఉమా రామలింగేశ్వర స్వామి అమ్మవార్లను, శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లను వివిధ ఫల పుష్పాలతో కనుల విందుగా అలంకరించి కళ్యాణోత్సవానికి ముస్తాబు చేశారు. అనంతరం భాజా భజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, శివనామ స్మరణలతో అశేష భక్త జన సందోహంతో ఇరువరి స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం కనుల పండుగగా నింగి,నెల హద్దుగా చక్కటి ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. కళ్యాణోత్సవాన్ని కనులారా తిలకించిన అశేష భక్తజనం పరవశించిపోయారు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి,జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ధర్మకర్తలు మార్ని సుబ్బారాయుడు నరసాయమ్మ దంపతులు, ఆలయ ధర్మకర్తల కమిటీసభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తాపేశ్వరం హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలం తాపేశ్వరం శ్రీ పోలిశెట్టి సత్తిరాజు భూషణం జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎస్ఐ వి.కిషోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాకాడ వెంకట రమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హెచ్ ఎం వెంకట రమణ మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, విద్యార్థుల ప్రగతిని వివరించారు. ముఖ్య అతిథి ఎస్ ఐ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. పి ఎం సి కో-ఆప్టెడ్ మెంబర్ శ్రీ కోరా శివశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు సెలవుల్లో జాగ్రత్తలు పాటిస్తూ వచ్చే విద్యా సంవత్సరానికి సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా నేర్చుకున్న పంజాబీ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కిషోర్, శివశ్రీ, వెంకట రమణ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎంసీ వైస్ ఛైర్మన్ తాసుపల్లి వెంకట లక్ష్మీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు వాడ్రేవు శ్రీనివాస్, హేమలత, జి ఎంఆర్ శాస్త్రి, సునంద వాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీపై అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలి

## - ఎంపీ పురంధరేశ్వరిపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో మహిళల సాధికారతకు కృషిచేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, వారిని దృష్టిలో పెట్టుకుని మహిళలకు రిజర్వేషన్ కల్పించడానికి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎల్లప్పుడూ అనుకూలంగానే ఉంటారని కాంగ్రెస్ రాజమండ్రి అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు సాకుతో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంలోని 131వ రాజ్యాంగ అధికరణానికి సవరణ చేసి డిలిమిటేషన్ బిల్లును ఆమోదింపచేయడానికి కుట్రలు పన్నిందని ఆరోపించారు. అందుకే పార్లమెంట్‌లో కూటమి ఎంపీలు ఆ బిల్లుకి వ్యతిరేకంగా ఓటువేయడం జరిగిందన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో బాలేపల్లితో పాటు పిసిపి ఉపాధ్యక్షుడు ఎస్.మార్టిన్ లూథర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మోతా శారద, నిడదవోలు కో ఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర తదితరులు మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకి తాము వ్యతిరేకం కాదని పార్లమెంట్ సాక్షిగా లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేసారన్నారు. బీజేపీ మాత్రం మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీయే అడ్డుకుందని దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలపై చేసిన విమర్శలను వారు తీవ్రంగా ఖండించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఇన్నేళ్ల తరువాత 2023లో రాజ్యసభలో పాస్ అయిన మహిళా రిజర్వేషన్ బిల్లును తెరపైకి తెచ్చి కుట్రలు చేయడం సమంజసం కాదన్నారు. 2023లోనే మహిళా బిల్లును ప్రవేశపెట్టారని, అయితే దాని అమలుపై ఇప్పటికీ స్పష్టత లేదని మురళీధర్ పేర్కొన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తవ్వడానికి సంవత్సరాలు పట్టే పరిస్థితిలో మహిళా బిల్లును ఎలా అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు.డిమిలిటేషన్ పేరుతో ఉత్తర భారత దేశంలోని రాష్ట్రాల్లో సీట్లు పెంచుకుని దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయాలని చూడటం బిజేపీకి తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీగా గెలిపించి కేంద్ర సహాయ మంత్రి పదవి ఇస్తే దాన్ని అనుభవించిన తరువాత పార్టీ మారి ఇప్పుడు కాంగ్రెస్‌ను విమర్శించడం పురంధరేశ్వరికి సమంజసం కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలతో పాటు మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ఎన్నో పథకాలు అమలు చేసిందన్నారు. ఇప్పుడు ఎంపీ దగ్గుబాటి కాంగ్రెస్ పార్టీయే మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ కాకుండా అడ్డుకుందని దుష్ప్రచారం చేసినా ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీపై అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా డాక్టర్స్ సెల్ ఛైర్మన్ రాజశేఖర్, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి సింధియా రాణి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దేవత సుధాకర్, అర్బన్ బీసీ సెల్ ఛైర్మన్ తాడి సూరిబాబు, అనపర్తి ఇన్చార్జి గుండ్రపు ఏసు, బిక్కవోలు ఇన్చార్జి కొల్లి చిన్న, బట్రే సుబ్రహ్మణ్యం, ఎండి ఆలీ, మురళీకృష్ణ, నిల్లా వీర్రాజు, యాళ్ళ వీర భద్రరావు, లలిత, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పులిని బంధించడానికి

# అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు



## ప్రజలు ధైర్యంగా జాగ్రత్తగా ఉండండి

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం కాపవరం పాండవుల మెట్టమీద బుధవారం రాత్రి నుండి పులి సంచరించడంతో అటవీశాఖ సిబ్బంది బంధించడానికి తమ చర్యలను కట్టుదిట్టం చేశారు. గురువారం తెల్లవారుజాము నుండి అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు చుట్టుపక్కల గ్రామాల్లో 144 సెక్షన్ ఏర్పాటు ప్రజలను అప్రమత్తం చేశారు. రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేస్తూ పులిని వెంటనే బంధించాలన్నారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ ప్రభాకర్ మాట్లాడుతూ రాడార్ సిగ్నల్స్ తో పోలవరం, కోటి కేశవరం మీదగా పాండవుల కొండకు వచ్చినట్లు గుర్తించామన్నారు. ప్రజలు భయభ్రాంతులకు గురి కావద్దని, పూణే విశాఖపట్నం రిస్క్ టీములతో ఆపరేషన్ స్టార్ట్ చేసి త్వరలోనే బంధిస్తామన్నారు. ఎక్కడ మనుషులకు ప్రాణాపాయం లేదని, పులి హతమార్చిన పశువుల యజమానులకు పరిహారం చెల్లిస్తున్నా మన్నారు.ఈ రోజు ఉదయం నుండి పులి కదలికలు గుర్తించి,బోన్లు ఏర్పాటు చేయడం, ట్రాప్ కెమెరాల ద్వారా పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నా మన్నారు. రాత్రి వేళల్లో విజన్ కెమెరాల ద్వారా పులి కదలికలను 24 గంటలు నిశితంగా పరిశీలిస్తున్నమన్నారు. గత 3 రోజులుగా పులి ఏ విధమైన ఆహారం తీసుకోలేదని వేటాడే అవకాశం ఉన్నందున తమ పశువులతో పాటు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండా లన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సుగుణ, అటవీ, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఖమేని ముస్లిం సమాజానికి చేసిన

# సేవలు చిరస్మరణీయం

- ఖమేని మృతికి రాజమండ్రి షియా ముస్లిం సోదరుల సంతాపం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇరాన్ అంబాసీ ప్రతినిధి ఆయతుల్లా అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి నగరంలో షియా ముస్లిం సోదరులు ప్రముఖ మత నాయకుడు ఖమేని మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాప సభలో పెద్ద సంఖ్యలో షియా ముస్లింలు పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు. సభలో ప్రార్థనలు నిర్వహించి, ఖమేని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇరాన్ అంబాసీ ప్రతినిధి ఆయతుల్లా అబ్దుల్ మజీద్ హకీమ్ ల్లాహి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఖమేని ముస్లిం సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు సుభాన్,మజీద్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వెదురుపాకలో విద్యార్థులకు వినూత్న స్వాగతం



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి మంచి ఆరంభాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ చేపట్టిన కార్యక్రమ గ్రామస్తులను ఆకట్టుకుంటుంది. తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం, వెదురుపాక గ్రామంలో గల ఎంపీపీపీఎస్ మెయిన్ పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసి, ఆరవ తరగతిలో ప్రవేశించనున్న విద్యార్థులకు గురువారం జెడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పోలిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో ఊరేగింపుగా పాఠశాలకు ఆహ్వానించి వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మొదటిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. మెయిన్ పాఠశాల అధ్యాపకులు సైతం విద్యార్థులకు ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్లను అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.ప్రకాష్‌రావు, కే.అర్జునుడు, జి.అప్పారావు, భాస్కరరావు, వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జల జీవన్ మిషన్ ద్వారా వాటర్ ట్యాంక్ నిర్మాణం

## మంచినీటి కొరత లేకుండా చర్యలు - నాగులచెరువు ప్రతి ఇంటింటికీ మంచినీటి కుళాయిలు



**కపిలేశ్వరపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గంలో ఎక్కడ వేసవిలో మంచి నీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. కపిలేశ్వరపురం మండలం, నాగులచెరువు గ్రామంలో జల జీవన్ మిషన్ ద్వారా తొడుగుడ్లపాడు లో రూ.14.48 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్ ను, ఇంటింటికీ మంచినీటి కుళాయి పథకాన్ని గురువారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, మాజీ సర్పంచ్ వాసంశెట్టి సత్యనారాయణ, గుత్తుల రామకృష్ణ, వాసంశెట్టి శ్రీనివాస్, గంజా ఆనందరావు, మేడిశెట్టి సత్యనారాయణ, చింతపల్లి సత్యనారాయణ, జుత్తుగ నాగేశ్వరరావు, జుత్తుగ నాగరాజు, జుత్తుగ శ్రీనివాస్, జుత్తుగ సత్యనారాయణ, జుత్తుగ వెంకటరమణ, జుత్తుగ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

## - అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. రూరల్ మండల పరిషత్ కార్యాలయం నందు రూరల్ మండల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ విధంగా గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, తక్షణమే ప్రజా సమస్యలు తీర్చే విధంగా కార్యాచరణ ఉండాలని అధికారులకు సూచించారు. కోట్లాది రూపాయలతో రోడ్లు డ్రైనేజీలు పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలని అన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా అధికారులు పనితీరు ఉండాలని, చాలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఇంకా ఎక్కడైనా రోడ్లు, డ్రైనేజీలు మౌలిక సదుపాయాల సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే పంచాయతీలో బకాయిలు ఉన్న పన్నులు వసూలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రుడా సెక్రెటరీ సాయిబాబు, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, ఆర్డబ్ల్యూఎస్ డీ.ఈ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో అమ్మి రాజు, పి.ఆర్ ఏ.ఈ.లు సంపత్ కుమార్, రమేష్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఇతర అధికారులు పాల్గొన్నారు.


ఎస్‌కేఆర్ మహిళా కళాశాల హాస్టల్‌ను

# డిగ్రీ ఆర్‌జెడి స్వాధీనం చేసుకోవాలి


## - ఎస్ఎఫ్ఐ డిమాండ్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రిలో ఉన్న శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల హాస్టల్ ని తక్షణమే డిగ్రీ ఆర్.జె.డి స్వాధీనం చేసుకోవాలని ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు వై. భాస్కర్, ఎన్. రాజా అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హితకారిణి సమాజం దౌర్జన్యంగా కళాశాల హాస్టల్ ని లాగేసుకోవటం తో విద్యార్థులు ఎస్.ఎఫ్.ఐ పెద్ద ఎత్తున పోరాడగా ఫలితంగా కళాశాల హాస్టల్ ని తిరిగి విద్యాశాఖ తీసుకోవాలని ఉన్నత విద్యామండలి కమిషనర్ ఫిబ్రవరి 25 తేదీన ఉత్తర్వులు జారీ చేసిన నేటికి హాస్టల్ ని స్వాధీనం చేసుకోలేదని తక్షణమే హాస్టల్ స్వాధీనం చేసుకోవాలని అన్నారు. డిగ్రీ ఆర్.జె.డి గారికి హాస్టల్ ని స్వాధీనం చేసుకోవాలని విద్యార్థులు, ఎస్.ఎఫ్.ఐ వినతిపత్రం అందజేసిన హాస్టల్ ని స్వాధీనం చేసుకోవట్లేదని విమర్శించారు. వార్డెన్ ని కేటాయిస్తే హాస్టల్ స్వాధీనం చేసుకుంటామని ఆర్.జె.డి సమాధానం ఇచ్చారు. అయితే ఆ హాస్టల్ కి వార్డెన్ ని కేటాయించామని 17/04/26 న ఉత్తర్వులు వచ్చిన నేటికీ హాస్టల్ ని స్వాధీనం చేసుకోక పోవటం అధికారులు నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. హాస్టల్ ని తక్షణమే డిగ్రీ ఆర్.జె.డి స్వాధీనం చేసుకోవాలని లేని పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

# డీఈఓ వాసుదేవ రావుచే "బడి పిలుస్తోంది" కరపత్రం ఆవిష్కరణ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు పాఠశాలల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తల్లిదండ్రులు ప్రభుత్వ సేవలతోపాటు ఈ సేవలను కూడా స్వీకరిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చెయ్యాలని తూర్పుగోదావరి జిల్లా విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు.స్థానిక రాజేంద్ర నగర్ ఎంపీపీ మోడల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమం లో "బడి పిలుస్తోంది " కరపత్రం ఆవిష్కరణ చేసారు.పాఠశాలకు 25 ఏళ్ళుగా సహకారం చేస్తున్న లయన్స్ క్లబ్ వారిని ఆయన అభినందించారు.వేసవి వారధి ప్రత్యేకతరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనంతరం డీఈవో వాసుదేవరావు, ఏపీసీ సుభాషిణి విద్యార్థుల ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.స్వయంగా బిస్కట్ పాకెట్స్ పంపిణీ చేసారు.ఈ సందర్భంగా వారితో పాటు తూర్పుగోదావరి జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ సుభాషిణి,అర్బన్ మండల విద్యా శాఖాధికారిణి రమా రజని,గౌతమీ జీవకారుణ్య సంఘం డైరెక్టర్ జీ సంజీవరావు,లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్, పీ రమేష్,పాఠశాల శాశ్వత ప్రాయోజితులు ఎన్ సుబ్రహ్మణ్యం, మాజీ కరెస్పాండంట్ కుమార్ వేగు,అజీజ్,హెచ్ఎమ్ డేనియల్ బాబ్, బోధనా సిబ్బంది,ఎమ్వీవీఎస్ లక్ష్మి,.పీ సుబ్రహ్మణ్యశ్వర రావు,కే సరళదేవి,పీ శివయ్య, కృష్ణ వేణి, స్వాతి, తల్లి దండ్రులు పాల్గొన్నారు.



# నగరంలో హీరో విశాల్ సందడి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆనాల వెంకట అప్పారావు రోడ్డులోని రాపో ఫిట్నెస్ సెంటర్ను ప్రముఖ హీరో విశాల్ సందర్శించారు. ఈ సందర్భంగా రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురి మధ్య సరదా సంరక్షణ జరిగింది.ఈ సందర్భంగా విశాల్ చేసే సామజిక సేవా కార్యక్రమాలను ఆదిరెడ్డి శ్రీనివాస్ గుర్తు చేసి అభినందించారు. ఫిట్నెస్ విషయంలో యువతకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. హీరో విశాల్ వస్తున్నారన్న సమాచారంతో ఆయన అభిమానులు భారీగా అక్కడకు చేరుకున్నారు. హీరో విశాల్‌ను ఫిట్నెస్ సెంటర్ నిర్వాహకులు ఇన్నమూరి దీపు, రామ్ తదితరులు ఘనంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మజ్జి రాంబాబు, కుడుపూడి సత్తిబాబు, నక్క చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.







### హీరోకు ఫేక్ మీసాలు.. దెబ్బకు 220 కోట్ల సినిమా అట్టర్ ఫ్లాప్..

# 4 ఏళ్లకు క్షమాపణ చెప్పిన హీరో..

సూపర్‌స్టార్ నటించిన ఓ భారీ బడ్జెట్ చిత్రం నాలుగేళ్ల క్రితం విడుదలైంది. దాదాపు రూ. 220 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైంది. ఇప్పుడు, నాలుగేళ్ల తర్వాత ఆ సినిమాలో నటించిన నటుడు ప్రేక్షకులకు క్షమాపణ చెప్పాడు. ఇంతకీ అతడు ఎవరో తెలుసా? ఆ సినిమా కథేంటీ? అనే విషయాలు తెలుసుకుందామా. సాధారణంగా ఈమధ్యకాలంలో చాలా వరకు భారీ బడ్జెట్ చిత్రాలు తెరకెక్కించడానికి ఆసక్తి చూపిస్తున్నారు మేకర్స్. అయితే చాలా వరకు పెద్ద పెద్ద ప్రాజెక్టులు బాక్సాఫీస్ వద్ద నిరాశపరుస్తుంటాయి. చారిత్రక కథాంశం, వైభవం చూపించి ఆ సినిమా సూపర్ హిట్ అవుతుందని భావిస్తారు. కానీ కొన్నిసార్లు నిర్మాతలు, దర్శకుల అంచనాలు తలకిందులు అవుతాయి. అలాంటి ఒక సినిమా నాలుగేళ్ల క్రితం విడుదలైంది. రూ. 220 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రంలో హీరో నకిలీ మీసాలు పెట్టుకున్నాడు. దీని కారణంగా పెద్ద వివాదం చెలరేగింది. ఎందుకంటే హీరో పోషించిన పాత్ర చారిత్రకంగా చాలా ముఖ్యమైనది. ఇప్పుడు, నాలుగేళ్ల తర్వాత, ఆ నటుడు ఈ తప్పుకు ప్రేక్షకులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాడు. మనం ఇక్కడ మాట్లాడుకుంటున్న సినిమా పేరు 'సామ్రాట్ పృథ్వీరాజ్'. ఇందులో నటుడు అక్షయ్ కుమార్ పృథ్వీరాజ్ చౌహాన్ పాత్రను పోషించారు. ప్రస్తుతం అక్షయ్ కుమార్ భూత్ బంగ్లా అనే సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. సామ్రాట్ పృథ్వీరాజ్ గురించి మాట్లాడారు. ఈ సినిమాలో నకిలీ మీసం పెట్టుకున్నందుకు ఆ సమయంలో తనపై చాలా ట్రోలింగ్ జరిగిందని అన్నారు. పృథ్వీరాజ్ చౌహాన్ పాత్ర కోసం ఆయన మీసం పెంచాల్సి వచ్చింది. కానీ అది సాధ్యం కాకపోవడంతో, ఆయన నకిలీ మీసం పెట్టుకున్నారు. దీనిపై అక్షయ్ మాట్లాడుతూ, "ఆ కథ కారణంగా, ఒక నిర్దిష్ట రకమైన మీసం అవసరమైంది. ఇప్పుడు, నేను అలాంటి మీసం పెంచలేను. ఎవరికైనా ఇది నచ్చకపోతే, క్షమాపణలు కోరుతున్నాను" అని అన్నారు. సినిమా నిర్మాణ సమయంలో కొన్ని నిర్ణయాలను తప్పించుకోవడం కష్టమని అక్షయ్ స్పష్టం చేశారు. అక్షయ్ సంవత్సరానికి రెండు, మూడు సినిమాలు చేస్తారు. అందుకే ఆయన షెడ్యూల్ ఏడాది పొడవునా బిజీగా ఉంటుంది. ఒకే సమయంలో వేర్వేరు సినిమాల్లో పనిచేయాల్సి రావడంతో, ప్రతి పాత్రకు పెద్ద శారీరక మార్పు చేసుకోవడం చాలా కష్టమవుతుంది. దీని కారణంగా, సాధారణంగా మేకప్, ప్రాస్థెటిక్స్, విజువల్ ఎఫెక్ట్స్ సహాయంతో విభిన్నమైన లుక్స్‌ను సృష్టిస్తారు. 'సామ్రాట్ పృథ్వీరాజ్' ఒక భారీ బడ్జెట్ చిత్రం. దీని నిర్మాణానికి నిర్మాతలు ఏకంగా రూ. 220 కోట్లు ఖర్చు చేశారు. కానీ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కేవలం రూ. 90 కోట్లు మాత్రమే వసూలు చేసింది. ఇందులో అక్షయ్ లుక్, అతను పోషించిన పాత్ర బాగోలేదని ప్రేక్షకులు ఫిర్యాదు చేశారు.

# ఎదురుగా పిజ్జా ఉన్నా తినకుండా డైట్..!

### సినిమా కోసం స్ట్రిక్ట్ డైట్ ఫాలో అవుతున్న స్టార్



నటీనటులు తెరపై కనిపించే ఆ కొన్ని నిమిషాల గ్లామర్ వెనుక నెలల తరబడి చేసే క్రమశిక్షణతో కూడిన సాధన ఉంటుంది. గతంలో వచ్చిన 'తేరే ఇష్క్ మే' సినిమా మానసికంగా తనను ఎంతో అలసిపోయేలా చేసిందని, అందుకే కొంచెం సరదాగా ఉండే సినిమా చేయాలనే ఉద్దేశంతో 'కాక్‌టెయిల్ 2' ఒప్పుకున్నానని కృతి తెలిపింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కృతి, షూటింగ్ సమయంలో తను పాటించిన కఠినమైన డైట్ గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించింది. హోమీ అదాజానియా దర్శకత్వంలో రాబోతున్న 'కాక్‌టెయిల్ 2' ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుండి సోషల్ మీడియాలో కృతి సనన్ మేకోవర్ గురించే చర్చ జరుగుతోంది. 'కాక్‌టెయిల్' మొదటి భాగంలో దీపికా పదుకొణె పోషించిన ఐకానిక్ 'వెరోనికా' పాత్రను గుర్తుకు తెచ్చేలా కృతి కనిపిస్తోంది. టోన్డ్ బికినీ బాడీ నుండి బోహేమియన్ అవుట్‌ఫిట్స్ వరకు ఆమె వేసుకున్న ప్రతి డ్రెస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అయితే, ఈ స్థాయి ఫిట్‌నెస్‌ను సాధించడం వెనుక కృతి పడిన శ్రమ అంతా ఇంతా కాదు.

**క్యాలరీ డెఫిసిట్ డైట్**

సినిమా కోసం కృతి తన జీవితంలో మొదటిసారి 'క్యాలరీ డెఫిసిట్' (తక్కువ క్యాలరీలు తీసుకోవడం) డైట్‌ను అనుసరించింది. విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఇటలీలోని సిసిలీలో జరిగింది. ఇటలీ అంటేనే పిజ్జాలు, పాస్తాలకు పెట్టింది పేరు. చుట్టూ నోరూరించే కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే వంటకాలు ఉన్నప్పటికీ, కృతి తన డైట్ విషయంలో ఏమాత్రం వెనకడుగు వేయలేదు. కేవలం టోన్డ్ లుక్ కోసం, ఒక అథ్లెటిక్ బాడీని సాధించడం కోసం ఆమె ఆ కఠినమైన ఆహార నియమాలను పాటించింది. క్యాలరీ డెఫిసిట్ డైట్ అనేది కేవలం బరువు తగ్గడానికే కాకుండా, శరీరంలోని కొవ్వును తగ్గించి మెటబాలిక్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఎంతో సహాయపడుతుంది. సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె, డయానా పెంటీ నటించిన 'కాక్‌టెయిల్' అప్పట్లో ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. ఇప్పుడు వస్తున్న ఈ సీక్వెల్‌లో కృతి సనన్‌తో పాటు షాహిద్ కపూర్, రష్మిక మందన్న నటిస్తున్నారు. కృతి తన అంకితభావంతో సాధించిన ఈ అద్భుతమైన మార్పు సినిమాపై అంచనాలను పెంచేసింది. వెండితెరపై కృతి సనన్ కొత్త అవతారం ప్రేక్షకులను ఏ విధంగా అలరిస్తుందో చూడాలి. ఈ చిత్రం జూన్ 19, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. గ్లామర్, ఎమోషన్స్, మంచి మ్యూజిక్ కలగలిసిన ఈ సినిమా కృతి కెరీర్‌లో మరో హిట్ గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. కృతి సనన్ ఫిట్‌నెస్ ప్రయాణం నేటి తరం యువతకు ఒక గొప్ప స్ఫూర్తి అని చెప్పవచ్చు.

### సంజూ శాంసన్ సెంచరీ.. అకీల్ హెుస్సేన్ స్పిన్ మ్యాజిక్..

# ముంబైపై భారీ విజయం నమోదు చేసిన గైక్వాడ్ సేన

ఈ మ్యాచ్‌కు అసలైన హీరో సంజూ శాంసన్. ఓపెనర్‌గా బరిలోకి దిగిన సంజూ, ముంబై బౌలర్లను ఆడుకున్నాడు. కేవలం 54 బంతుల్లోనే 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇందులో 10 ఫోర్లు, 6 భారీ సిక్సర్లు ఉన్నాయి. ఐపీఎల్ కెరీర్‌లో ఇది ఆయనకు ఐదో సెంచరీ కాగా, ఈ సీజన్‌లో రెండోది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఎల్ క్లాసికో పోరులో చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) ఊహించని రీతిలో ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసింది. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో ఏకంగా 103 పరుగుల భారీ తేడాతో ముంబైని వారి సొంత గడ్డపైనే మట్టికరిపించి సీఎస్కే ఘనవిజయం సాధించింది. సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగి సెంచరీ బాదగా, బౌలింగ్‌లో అకీల్ హెుస్సేన్, నూర్ అహ్మద్ ముంబై బ్యాటింగ్ నడ్డి విరిచారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 207 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్‌గా వచ్చిన సంజూ శాంసన్ ఆరంభం నుంచే ముంబై బౌలర్లను ఒక ఆట ఆడుకున్నాడు. కేవలం 54 బంతుల్లో 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇందులో 10 ఫోర్లు, 6 భారీ సిక్సర్లు ఉన్నాయి. ఇది ఆయన ఐపీఎల్ కెరీర్‌లో ఐదో సెంచరీ కాగా, ఈ సీజన్‌లో రెండోది. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాది సంజూ తన సెంచరీని పూర్తి చేసుకోవడం విశేషం. మిగిలిన బ్యాటర్లలో రుతురాజ్ (22), కార్తీక్ శర్మ (18) పర్వాలేదనిపించారు. 208 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కు ఏదీ కలిసి రాలేదు. ఆరంభంలోనే ఓపెనర్ దానిష్ మలేవార్ డకౌట్ కాగా, కొద్దిసేపటికే క్వింటన్ డికాక్ (7) అవుట్ అయ్యాడు. నమన్ ధీర్ కూడా సున్నాకే వెనుదిరగడంతో ముంబై పీకల్లోతు కష్టాల్లో పడింది. సూర్యకుమార్ యాదవ్ (36), తిలక్ వర్మ (37) జట్టును ఆదుకునే



ప్రయత్నం చేసినా.. అకీల్ హెుస్సేన్ వారిద్దరినీ అవుట్ చేసి ముంబై ఆశలపై నీళ్లు చల్లాడు. బౌలింగ్‌లో సీఎస్కే స్పిన్నర్లు అద్భుతం చేశారు. అకీల్ హెుస్సేన్ కీలకమైన వికెట్లు తీయగా, నూర్ అహ్మద్ తన స్పెల్‌లో వరుస బంతుల్లో హార్దిక్ పాండ్యా (1), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (0)లను పడగొట్టి ముంబైని కోలుకోలేని దెబ్బ తీశాడు. చివరికి ముంబై 19 ఓవర్లలో 104 పరుగులకే చాపచుట్టేసింది. అన్షుల్ కంబోజ్ చివరి వికెట్ తీయడంతో ముంబై ఆలౌట్ అయ్యింది. ముంబై బ్యాటర్లలో ఐదుగురు సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం కావడం ఆ జట్టు దారుణ వైఫల్యానికి నిదర్శనం. ముంబైపై ముంబైలోనే ఈ స్థాయిలో గెలవడం సీఎస్కే కు పెద్ద బూస్టప్ ఇచ్చింది. సంజూ శాంసన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. ధోనీ లేకపోయినా, రోహిత్ లేకపోయినా ఈ ఎల్-క్లాసికోలో సంజూ తన మార్క్ చూపించాడు. ఈ విజయంతో సీఎస్కే పాయింట్ల పట్టికలో టాప్ 5కి లోకి చేరుకోగా, ముంబైకి ప్లేఆఫ్ దారులు మరింత కష్టతరంగా మారాయి. ముంబై ఫ్యాన్స్ నిశ్శబ్దంగా స్టేడియం వీడగా, పసుపు చొక్కాల ఫ్యాన్స్ పండగ చేసుకున్నారు.

**వాంఖడేలో సెంచరీతో సంజూ శివతాండవం..**

ఐపీఎల్ 2026లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరుగుతున్న ఎల్-క్లాసికో సమరం పరుగుల వరద పారిస్తోంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ ఇన్నింగ్స్‌లో అందరి దృష్టిని ఆకర్షించింది మాత్రం సంజూ శాంసన్ వీరవిహారమే. ముంబై బౌలర్లను తన బ్యాట్‌తో చెడుగుడు ఆడుకున్నాడు సంజూ శాంసన్. ఈ సీజన్లో రెండో సెంచరీ నమోదు చేసి 101 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. సంజూ అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టుకు కొండంత స్కోరును అందించాడు. నేటి మ్యాచ్‌లో సంజూ శాంసన్ అద్భుతమైన ఫామ్‌ను కనబరిచాడు. ఓపెనర్‌గా వచ్చిన సంజూ, ఆరంభం నుంచే ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 26 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఇది ఆయన ఐపీఎల్ కెరీర్‌లో 27వ హాఫ్ సెంచరీ. సెంచరీ దిశగా దూసుకుపోతున్న క్రమంలో కీలక వికెట్లు పడుతున్నా వెనక్కు తగ్గలేదు. ఆయన చివరి వరకు క్రీజులో ఉండి 54 బంతుల్లో 101 పరుగుల చేసి జట్టు స్కోరును 200 దాటించడంలో కీలక పాత్ర పోషించాడు. సంజూ క్లాస్ షాట్లు చూసి వాంఖడే స్టేడియం హోరెత్తిపోయింది. చెన్నై ఇన్నింగ్స్ ఆరంభంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (22) దూకుడుగా ఆడినా ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. అల్లా ఘజన్ ఫర్ వేసిన మూడో ఓవర్లో ఆయన అవుట్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన సర్ఫరాజ్ ఖాన్ (14), శివమ్ దూబే (5) త్వరగానే పెవిలియన్ చేరారు. అయితే మరోవైపు సంజూ శాంసన్ మాత్రం ముంబై బౌలర్లను నిర్దాక్షిణ్యంగా బాదేశాడు. డెవాల్డ్ బ్రెవిస్ (22), కార్తీక్ శర్మ (18) మెరుపులు మెరిపించి సంజూకు సహకరించారు. చివర్లో జేమీ ఓవర్టన్ 7 బంతుల్లో 15 పరుగులు చేసి అశ్విని కుమార్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా రెండో ఓవర్లోనే 19 పరుగులు ఇచ్చి భారీగా మూల్యం చెల్లించుకున్నాడు. అయితే బుమ్రా ఎప్పటిలాగే పొదుపుగా బౌలింగ్ చేస్తూ ఒక వికెట్ పడగొట్టాడు. అశ్విని కుమార్ 2 వికెట్లతో రాణించినప్పటికీ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. అల్లా ఘజన్ ఫర్, మిచెల్ శాంట్నర్ తలో వికెట్ తీశారు. ముంబై ఫీల్డింగ్‌లో కొన్ని తప్పిదాలు జరగడం చెన్నైకి కలిసొచ్చింది. చెన్నై నిర్దేశించిన 208 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాలంటే ముంబై బ్యాటర్లు అద్భుతం చేయాల్సిందే. వాంఖడే పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో మ్యాచ్ రసవత్తరంగా మారే అవకాశం ఉంది. ముంబై తరపున క్వింటన్ డికాక్, సూర్యకుమార్ యాదవ్, ఇన్-ఫామ్ బ్యాటర్ తిలక్ వర్మ ఏ స్థాయిలో రాణిస్తారనే దానిపైనే విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. ముంబైకి ప్రతి ఓవర్లో 10.4 సగటు పరుగులు అవసరం.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com